


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 197 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 23 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :197 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 23 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇక్కడో అద్భుతం జరిగింది...
# ఎవరూ చనిపోలేదు

- ఇరాన్ మిస్సైల్ దాడి జరిగిన అరాడ్ నగరాన్ని సందర్శించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- ప్రాణనష్టం జరగకపోవడం అద్భుతమేనని వ్యాఖ్య
- ఇరాన్ ప్రపంచ భద్రతకే ముప్పు అని తీవ్ర హెచ్చరిక
- యూరప్‌పై దాడి చేసే సామర్థ్యం కూడా ఇరాన్‌కు ఉందని వెల్లడి
- ఇరాన్‌పై కఠిన చర్యలకు ప్రపంచ దేశాలకు పిలుపు

- మిగతా2లో



## ఇలాంటి వ్యక్తిని సంఘ బహిష్కరణ చేయాలి

- తల్లి, చెల్లి పట్ల జగన్‌కు కనికరం లేదన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు
- రాష్ట్ర అభివృద్ధికి, పరిశ్రమలకు జగన్ అడ్డుపడుతున్నారని తీవ్ర విమర్శ
- ఉత్తరాంధ్రలో 1.5 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు
- జూన్ నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం
- కుటుంబ బాధ్యత లేని జగన్‌ను సమాజం నుంచి బహిష్కరించాలని పిలుపు

- మిగతా2లో






## హైదరాబాదులో శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి

- బేగంపేటలో అపార్ట్‌మెంట్ శ్లాబు కూలి ఇద్దరి మృతి
- కరెంటు పని చేస్తుండగా ప్రమాదం.. ఇంటి యజమానికి తీవ్ర గాయాలు
- ఇంటి యజమాని పరిస్థితి విషమం

- మిగతా2లో

# అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను

- ఐఎస్బీ సదస్సులో ప్రసంగించిన ఏపీ సీఎం చంద్రబాబు
- బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా మార్చిన విధానం వెల్లడి
- అభివృద్ధి చేసినా రాజకీయంగా ఎదురైన ఓటములు, నేర్చిన పాఠాల ప్రస్తావన
- అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో ఏపీ భవిష్యత్‌కు బలమైన పునాది వేశామని వివరణ
- సంపద సృష్టితో పాటు సమాజ సేవ కూడా ముఖ్యమని పారిశ్రామికవేత్తలకు పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ)లో జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్-2026 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్' అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిన తన ప్రస్థానాన్ని, రాజకీయంగా ఎదురైన సవాళ్లను, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ కోసం తనకున్న దార్శనికతను ఆయన పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనేవి మూడు కీలక స్తంభాలని, వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

**బంజరు భూమి నుంచి భాగ్యనగరంగా...**

1995లో తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేనాటికి హైదరాబాద్, సికింద్రాబాద్ అనే జంట నగరాలు మాత్రమే ఉన్నాయని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, బిల్ గేట్స్ తీసుకొచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని గమనించి, భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీదే అని తాను దృఢంగా విశ్వసించానని తెలిపారు. అప్పట్లో సైబరాబాద్ ప్రాంతం మొత్తం పాములు, ముళ్లపొదలతో నిండిన బంజరు భూమి అని, అక్కడ హైటెక్ సిటీ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ మొదట వెనుకాడిందని చెప్పారు. అయితే, వారిని ఒప్పించి పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ప్రా) పద్ధతిలో కేవలం 15 నెలల్లోనే ఆ అద్భుత కట్టడాన్ని పూర్తి చేశామని వివరించారు. ఆ తర్వాత బిల్ గేట్స్‌ను కలిసి, కేవలం

- మిగతా2లో

## అధికార పీఠంపై 8,931 రోజులు... ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

- భారత చరిత్రలో సరికొత్త రికార్డ్ సృష్టించిన ప్రధాని మోదీ
- అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా సేవలందించిన వ్యక్తిగా ఘనత
- ప్రధాని మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు
- 8,931 రోజుల సేవ పూర్తి చేసుకుని చారిత్రక మైలురాయిని అధిగమించారని ప్రశంస
- మోదీ దార్శనికత, నిబద్ధత దేశ ప్రగతికి నిదర్శనమని వ్యాఖ్య




**పెన్ పవర్ డెస్క్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత చరిత్రలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న నేతగా అరుదైన ఘనత అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దేశానికి 8,931 రోజుల పాటు సేవ చేసి చారిత్రక మైలురాయిని చేరుకోవడంపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు."గౌరవనీయులైన భారత ప్రధాని నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక అభినందనలు. భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం పాటు ప్రభుత్వ అధినేతగా సేవలందించిన వ్యక్తిగా చారిత్రక మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఈ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దేశానికి 8,931 రోజుల పాటు సేవను పూర్తి చేసుకోవడం

- మిగతా2లో



## ఖతార్‌లో కూలిపోయిన సైనిక హెలికాప్టర్... ఆరుగురి మృతి

- ఖతార్ సముద్ర జలాల్లో కుప్పకూలిన సైనిక హెలికాప్టర్
- ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది మృతి, ఒకరు గల్లంతు
- సాంకేతిక లోపమే కారణమని వెల్లడించిన రక్షణ శాఖ
- గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న ముమ్మర గాలింపు
- శత్రుచర్య కాదని స్పష్టం చేసిన అధికారులు


- మిగతా2లో

## అక్రమ ఫిషింగ్ బోట్లతో వేటను ఆపేయండి..

### తమిళనాడు ప్రభుత్వానికి ఏపీ సర్కారు విజ్ఞప్తి

- ఏపీ సముద్ర జలాల్లో తమిళనాడు బోట్ల అక్రమ వేట
- చర్యలు తీసుకోవాలంటూ తమిళనాడుకు ఏపీ ప్రభుత్వ లేఖ
- స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ముప్పుగా మారిన వైనం
- నెల్లూరులో పోలీసుల అదుపులో ఉన్న బోట్లను తీసుకెళ్లిన ఘటన
- నిషిద్ధ పద్ధతులతో సముద్ర జీవులు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన

- మిగతా2లో





## 25 ఏళ్లుగా అధికారంలో..

### ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు

- భారత్‌లో అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా మోదీ రికార్డు
- సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బ్రేక్
- సీఎంగా, పీఎంగా కలిపి 25వ సంవత్సరంలోకి అడుగు
- సోషల్ మీడియాలోనూ అరుదైన మైలురాళ్లు దాటిన ప్రధాని
- యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రపంచ నేతల్లో అగ్రస్థానం

- మిగతా2లో

## మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ

- శెట్టిబలిజ జాతిపితకు సముచిత గౌరవం
- యువగళం హామీకి కార్యరూపం
- సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి రాష్ట్ర పండుగగా ప్రకటన
- ప్రతి ఏటా మార్చి 23న అధికారికంగా వేడుకలు జరపాలని ప్రభుత్వ ఉత్తర్వులు
- శెట్టిబలిజ సమాజ అభ్యున్నతికి దొమ్మేటి సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:**యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మరో కీలక హామీని ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. ప్రముఖ సంఘ సంస్కర్త, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు

- మిగతా2లో

## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష



- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష
- పెట్రోలియం, గ్యాస్, విద్యుత్, ఎరువుల సరఫరాపై ప్రధానంగా చర్చ
- అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే 70% చమురు దిగుమతులు గల్ఫ్ యేతర దేశాల నుంచేనన్న అధికారులు
- ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. దేశంలో పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాల్లో సరఫరాకు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

### రెండవ మంత్రి పదవి : టీడీపీకా...జనసేనకా ?

తొందరలోనే కూటమి ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. 2024లో మంత్రివర్గం ఏర్పాటు అయినపుడు విశాఖ జిల్లాకు మంత్రి పదవి దక్కలేదు. మొత్తం అంతా కూటమి ఎమ్మెల్యేలే ఇక్కడ గెలిచారు. అంతే కాదు రాష్ట్రంలో తొంబై వేల పై దాటి మెజారిటీ వచ్చిన టాప్ త్రీ ర్యాంకర్లలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఈ జిల్లాలోనే ఉన్నారు. వారిలో ఒకరు భీమిలీ ఎమ్మెల్యే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అయితే రెండవ వారు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరికి మంత్రి పదవి కచ్చితంగా దక్కుతుందని అంతా అంచనా వేశారు. కానీ ఏకంగా విశాఖ జిల్లాకే మంత్రి పదవికి చోటు లేకుండా పోయింది.

**అనకాపల్లి జిల్లాకి :**
ఇక అనకాపల్లి జిల్లాలోనూ కూటమి ఎమ్మెల్యేలే మొత్తం గెలిచారు. అయితే ఈ జిల్లా నుంచి పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన వంగలపూడి అనితకు హోం మంత్రి పదవి అనూహ్యంగా దక్కింది. అలాగే సీనియర్ మోస్ట్ లీడర్ గా ఉన్న నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుకి స్పీకర్ పదవిని ఇచ్చి తగిన న్యాయం చేశారు. అయితే అనకాపల్లిలోనూ సీనియర్ నేతలు చాలా మంది మంత్రి పదవి కోసం ఆశ పడిన పరిస్థితులు ఉన్నాయి. అనకాపల్లి నుంచి గెలిచిన సీనియర్ నేత కొణతాల రామక్రిష్ణకు మంత్రి పదవి కచ్చితంగా జనసేన కోటాలో దక్కుతుందని అంతా అనుకున్నారు. సౌమ్యుడు వివాదరహితుడు, పైగా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో పాటు జిల్లా రాజకీయాల మీద సామాజిక భౌగోళిక పరిస్థితుల మీద పూర్తి అవగాహన ఉన్న కొణతాలకు మంత్రి పదవి ఖాయమని లెక్కలేసుకున్నారు. కానీ అది కూడా జరగలేదు. అలాగే మరో సీనియర్ నేత మాడుగుల నుంచి ఎమ్మెల్యే అయిన బండారు సత్యనారాయణ మూర్తి మంత్రి పదవిని ఆశించారు అని ప్రచారం సాగింది.

**విస్తరణలో విస్తరి :**
ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని అంతటా ప్రచారం సాగుతోంది. దాంతో కచ్చితంగా మంత్రి పదవి ఈ రెండు జిల్లాలలో ఆశావహులకు దక్కుతుందని అనుచరులు అయితే ధీమాగా ఉన్నారు. అనకాపల్లి జిల్లా విషయానికి వస్తే కొణతాల రామక్రిష్ణకు జనసేన తరపున ఇచ్చే మంత్రి పదవి దక్కుతుందని అంటున్నారు. జనసేనలో ముగ్గురు మంత్రులు ఉన్నారు, విశాఖ నుంచి మరో మంత్రి పదవిని ఆ పార్టీ ఆశిస్తోంది. ఆ పదవిని బీసీ నేతకు సీనియర్ కి ఇవ్వడం ద్వారా జనసేన సామాజిక న్యాయం పాటించాలని చూస్తోంది అని అంటున్నారు. అంతే కాదు ప్రాంతీయ సమతూకం సరిపోతుందని ఉత్తరాంధ్రాలో రానున్న కాలంలో మరింతగా బలపడేందుకు కొణతాల లాంటి వారికి మంత్రి పదవి బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.

**విశాఖ జిల్లాలో చూస్తే :**
ఇక విశాఖ జిల్లాలో ఈసారి విస్తరణలో కచ్చితంగా ఒకరికి చాన్స్ ఉంటుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం విశాఖ జిల్లాలోనే ఎక్కువగా ఫోకస్ పెడుతూ అభివృద్ధికి అవకాశం ఇస్తోంది. దాంతో మంత్రి స్థానికంగా ఉంటే బాగుంటుంది అన్న భావన నెలకొంది అంటున్నారు. అయితే ఈ మంత్రి పదవి కోసం టీడీపీలో పోటీ భారీగానే ఉంది. అలాగే బీజేపీ నుంచి జనసేన నుంచి ఆశిస్తున్న వారు ఉన్నారు. ఇక విశాఖ జిల్లాను ఉమ్మడిగా చూసినపుడు స్పీకర్ పదవి ఇచ్చారు, ఒక మంత్రిగా ఇప్పటికే హోం మంత్రి ఉన్నారు. ఇస్తే గిస్తే మరో పదవి ఇస్తారు అని అంటున్నారు. మరి దాని కోసం పెద్ద ఎత్తున పోటీ ఉంటే ఎవరికి దక్కుతుంది అన్నదే చర్చగా ముందుకు వస్తోంది.

**రెండు పార్టీల మధ్యలో :**
రెండు పార్టీలైన జనసేన టీడీపీ మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నట్లుగా కనిపిస్తోంది. అనకాపల్లి జిల్లాలో రెండవ మంత్రి పదవి ఉండదని అంటున్నారు. ఒకవేళ ఉంటే వంగలపూడి అనితకు పక్కన పెట్టాల్సి ఉంటుందని చెబుతున్నారు. విశాఖ జిల్లాలో మంత్రి పదవి అయితే కచ్చితంగా తెలుగుదేశం పార్టీకి చెందిన వారికే ఇస్తారు అని ప్రచారం సాగుతోంది. మరి కొణతాలకు మంత్రి పదవి అంటూ వస్తున్న ఊహాగానాల సంగతేంటని ఆలోచిస్తే మాత్రం అనితని తప్పిస్తేనే తప్ప అది సాధ్యపడదని అంటున్నారు విస్తరణ కానీ పునర్ వ్యవస్థీకరణ కానీ చేస్తే అపుడు భారీ మార్పులు ఉండొచ్చని అలా పాత వారిలో ఆరేడు మందిని పక్కన పెట్టి కొత్త వారికి చోటు ఇవ్వవచ్చు అని అంటున్నారు. ఏది ఏమైనా కాబోయే మంత్రులుగా కొణతాల రామక్రిష్ణతో పాటు పల్లా శ్రీనివాస్, గంటా శ్రీనివాస్ పేర్లు అయితే ఎక్కువగా వినిపిస్తున్నాయని అంటున్నారు.

## అక్రమ ఫిషింగ్ బోట్లతో వేటను ఆపేయండి..

ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లోకి తమిళనాడుకు చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లు అక్రమంగా ప్రవేశించి వేట సాగించడంపై ఏపీ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై తమిళనాడు ప్రభుత్వ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపింది. తమిళనాడు బోట్ల చొరబాట్లను నివారించేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఏపీ ఫిషరీస్ కమిషనర్ రామ శంకర్ నాయక్, తమిళనాడు ఫిషరీస్ అండ్ ఫిషర్‌మెన్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. తమిళనాడు బోట్ల అక్రమ ప్రవేశం యథేచ్ఛగా కొనసాగుతోందని, దీనివల్ల స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని లేఖలో పేర్కొన్నారు. ఈ చొరబాట్లు శాంతిభద్రతల సమస్యలకు కూడా దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 18న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ఓ సంఘటనను ఆయన తమిళనాడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల అదుపులో ఉన్న నాలుగు ఫిషింగ్ బోట్లను పుదుచ్చేరికి చెందిన మత్స్యకారులు బలవంతంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ ఘటన కారణంగా తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని 162 మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. ఇదే సమస్యపై 2022, 2023, 2025 సంవత్సరాల్లో కూడా లేఖలు రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తమిళనాడు బోట్లు ఏపీ జలాల్లో ట్రాలింగ్ వంటి విధ్వంసకర పద్ధతుల్లో వేట సాగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రామ శంకర్ నాయక్ తెలిపారు. దీనివల్ల తాబేళ్లు, ఇతర అంతరించిపోతున్న సముద్ర జీవుల మరణాలు పెరిగి, వాటి కళేబరాలు ఏపీ తీరానికి కొట్టుకొస్తున్నాయని లేఖలో వివరించారు.

## మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ

- మొదటి పేజి తరువాయి

దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో ఈ మేరకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తామని లోకేశ్ అప్పట్లో ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీని ప్రకారం, ప్రతి ఏటా మార్చి 23న అన్ని ప్రభుత్వ శాఖలు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నాయి. కోనసీమ ప్రాంతానికి చెందిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్త. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, 19వ శతాబ్దం తొలినాళ్లలోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటుపడ్డారు. విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారు. ఆయన సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఖతార్‌లో కూలిపోయిన సైనిక హెలికాప్టర్... ఆరుగురి మృతి

ఖతార్‌లో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశానికి చెందిన ఒక సైనిక హెలికాప్టర్ సముద్ర జలాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడమే ప్రమాదానికి కారణమని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. "ఖతార్‌కు చెందిన హెలికాప్టర్ రొటీన్ డ్యూటీలో ఉండగా సాంకేతిక సమస్య కారణంగా దేశ జలాల్లో కూలిపోయింది" అని ఆ ప్రకటనలో పేర్కొంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఏడో వ్యక్తి కోసం కోస్ట్ గార్డ్, బోర్డర్ సెక్యూరిటీ, అంతర్గత భద్రతా దళాలకు (లెఖ్వియా) చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ ఘటన జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదమేనని, దీని వెనుక ఎలాంటి శత్రుచర్య లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ రకం, అది కూలిపోయిన కచ్చితమైన ప్రదేశం వంటి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను

- మొదటి పేజి తరువాయి

10 నిమిషాల అపాయింట్‌మెంట్‌లో 45 నిమిషాల పాటు చర్చించి, భారతీయుల ప్రతిభను వివరించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటుకు ఒప్పించానని, ఆ రోజు తాను వేసిన పునాది వల్లే ఈ రోజు హైదరాబాద్ ఐటీ హబ్‌గా విలసిల్లుతోందని అన్నారు.

**ఐఎస్బీ, విమానాశ్రయం.. హైదరాబాద్‌కు కొత్త రూపు**
హైదరాబాద్‌కు ఐఎస్బీని తీసుకురావడానికి తాను పడిన శ్రమను చంద్రబాబు వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కలిసి ముంబై, బెంగళూరు, చెన్నైలలో ఐఎస్బీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలియగానే, తాను వెంటనే వారిని సంప్రదించి హైదరాబాద్‌కు ఆహ్వానించానని తెలిపారు. వారిని ఒప్పించడానికి తన మంత్రివర్గ సహచరులను విమానాశ్రయానికి పంపి, తానే స్వయంగా వారికి అల్పాహారం వడ్డించానని గుర్తు చేసుకున్నారు. మిగతా నగరాలు ఇచ్చే ఆఫర్ల కన్నా "బెస్ట్ ప్లస్ వన్" ఇస్తానని ఒక్క మాటతో హామీ ఇచ్చానని, తన చిత్తశుద్ధిని నమ్మి వారే హైదరాబాద్‌లో ఐఎస్బీ ఏర్పాటుకు ముందుకొచ్చారని చెప్పారు. అలాగే, చిన్నగా ఉన్న బేగంపేట విమానాశ్రయానికి ముందుగా ట్రాఫిక్ పెంచి, ఆ తర్వాత 5,000 ఎకరాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా నిర్మించామని తెలిపారు.

**అభివృద్ధి చేసినా.. రాజకీయంగా ఎదురుదెబ్బలు**
ఎంత అభివృద్ధి చేసినప్పటికీ, రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజమని చంద్రబాబు అన్నారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధికి ఎన్నో పనులు చేసినా, 2004 ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని అంగీకరించారు. "అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ (శీఎంవంంఅశీఅ) వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను. కేవలం అభివృద్ధి చేస్తే సరిపోదు, రాజకీయాలను కూడా చూసుకోవాలని ఆ ఓటమి నాకు నేర్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినా, రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. 2019లో మరోసారి ఓటమి ఎదురైందని, ఈ అనుభవాలు తనను మరింత రాటుదేల్చాయని తెలిపారు.

**విభజన తర్వాత.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా**
2024లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇప్పుడు తన ముందున్న ఏకైక లక్ష్యం "స్వర్ణాంధ్ర ప్రదేశ్" నిర్మాణమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని, దానిని తిరిగి పునర్నిర్మించే పనిలో ఉన్నానని చెప్పారు. గత 21 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దీని ద్వారా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని వివరించారు. గూగుల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని, అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. విజన్ 2047 డాక్యుమెంట్ సిద్ధం చేశామని, వచ్చే 15 ఏళ్ల పాటు ఏటా 15% వృద్ధి రేటు సాధించి, 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు.

**అమరావతి, పోలవరం.. ఏపీకి జీవనాధారాలు**
అమరావతి కేవలం రాజధాని కాదని, అది ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 33,000 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందని, ఇప్పుడు మళ్లీ పనులు వేగవంతం చేశామని తెలిపారు.
"అమరావతిని హైదరాబాద్ ప్లస్ సిటీగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరాల్లో ఒకటిగా నిర్మించి తీరుతా" అని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ మరమ్మతులు పూర్తిచేసి, వచ్చే ఏడాదికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**సంపద సృష్టితో పాటు.. సమాజ సేవ ముఖ్యం**
పారిశ్రామికవేత్తలు సంపద సృష్టితో పాటు సామాజిక బాధ్యతను కూడా విస్మరించవద్దని చంద్రబాబు పిలుపునిచ్చారు. తాను గతంలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ౡ3) మోడల్‌ను ప్రోత్సహించానని, ఇప్పుడు సమాజంలోని
అసమానతలను తగ్గించడానికి P4 (People-Public-Private Partnership for Philanthropy) మోడల్‌ను ముందుకు తెస్తున్నానని చెప్పారు. "వీదీఖ 10–20" అనే కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తున్నానని, అంటే "మార్గదర్శి–బంగారం" అని అర్థమని వివరించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10% మంది, అట్టడుగున ఉన్న 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. డబ్బు ఇవ్వడమే కాకుండా, వారికి మార్గనిర్దేశం చేసి చేయూతనివ్వడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని హితవు పలికారు.

# ఇలాంటి వ్యక్తిని సంఘ బహిష్కరణ చేయాలి

సమాజం పట్ల, కన్నతల్లి, తోబుట్టువు పట్ల కనీస కనికరం, గౌరవం లేని వ్యక్తి నాయకుడిగా ఎలా రాణిస్తారని వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓటమి తర్వాత కూడా జగన్ తన దుర్మార్గపు ఆలోచనలను మానుకోలేదని, సొంత కుటుంబ సభ్యులపైనే విషప్రచారం చేయిస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కుటుంబ బాధ్యత, సామాజిక స్పృహ లేని ఇలాంటి వ్యక్తిని రాజకీయంగా ఓడించడం అనేది చిన్న మాట.. ఆయన్ను సమాజం నుంచే బహిష్కరించాలి" అని కలిశెట్టి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరు రాష్ట్ర పరువును జాతీయ స్థాయిలో మంటగలుపుతోందన్నారు. కన్నతల్లి విజయమ్మను కోర్టుల పాలు చేస్తూ, తన పేటీఎం బ్యాచ్‌తో ఆమెపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. సొంత కుటుంబంలోని మహిళలకే రక్షణ ఇవ్వలేని వ్యక్తి, రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏం భరోసా ఇస్తారని ప్రశ్నించారు. ఇది వారి ఇంటి వ్యవహారం కాదని, రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ మనోభావాలకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర ఆడబిడ్డగా ఎవరికి అన్యాయం జరిగినా అండగా నిలవాల్సిన బాధ్యత టీడీపీపై ఉందని, జగన్ కుటుంబ సభ్యులకు కూడా తమ నైతిక మద్దతు ఉంటుందని తెలిపారు.

**ఉత్తరాంధ్రను ఉత్తుత్తి ఆంధ్రగా మార్చారు**
గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, 'ఉత్తుత్తి ఆంధ్ర'గా మార్చేశారని అప్పలనాయుడు ఆరోపించారు. అక్కడి వనరులను దోచుకున్నారు తప్ప, యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. కానీ, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత లోకేశ్, బీజేపీ నాయకత్వం రాష్ట్రానికి నాలుగు స్తంభాలుగా నిలబడి ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.
కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లోనే ఉత్తరాంధ్ర అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి అంటే మాటలు కాదని, చేతల్లో చూపిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తుంటే.. జగన్ ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెండు కళ్లు**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో ఉత్తరాంధ్ర దశ మారుతోందని కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేలా దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి సోమవారం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. సుమారు రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించనున్న ఈ ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ ఒక్క పరిశ్రమతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా ఉపాధి లభిస్తుందని చెప్పారు.
అలాగే, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది జూన్ నాటికి ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈ స్టీల్ ప్లాంట్, విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెండు కళ్ల వంటివని, భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**వ్యవస్థలను భ్రష్టుపట్టించే సైకో మనస్తత్వం**
కుటుంబ బాధ్యత, సామాజిక స్పృహ లేని జగన్ లాంటి సైకో మనస్తత్వం ఉన్న వ్యక్తులను రాబోయే ఎన్నికల్లో ఓడించడం చిన్న మాటేనని, వారిని సమాజం నుంచి బహిష్కరించాలని అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్యకు గురైతే, మొదట గుండెపోటని నాటకమాడి, ఆ తర్వాత 'నారాసుర రక్త చరిత్ర' అంటూ తప్పుడు రాతలు రాయించారని గుర్తుచేశారు. నిందితులను కాపాడటానికి జగన్ ఎందుకు తాపత్రయ పడుతున్నారని నిలదీశారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై కూడా తన పేటీఎం బ్యాచ్‌తో అబద్ధపు ప్రచారాలు చేయిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి అసెంబ్లీకి రాకుండా, నాలుగు గోడల మధ్య కూర్చుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాల అనుభవం ఉన్న చంద్రబాబును నోటికొచ్చినట్లు దూషించడం, గతంలో 'నడిరోడ్డుపై కాల్చి చంపండి' అని రెచ్చగొట్టడం జగన్ నైజానికి నిదర్శనమన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఆయనలో మార్పు రాలేదని, ఇలాంటి వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు.

## ఇక్కడో అద్భుతం జరిగింది... ఎవరూ చనిపోలేదు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం దక్షిణ ఇజ్రాయెల్‌లోని అరాడ్ నగరాన్ని సందర్శించారు. ఇరాన్ ప్రయోగించిన మిస్సైల్ పడిపోయిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. "నేను ఇక్కడ అరాడ్‌లో ఉన్నాను. ఇక్కడో అద్భుతం జరిగింది, ఎవరూ చనిపోలేదు. కానీ మనం కేవలం అద్భుతాలపై ఆధారపడదల్చుకోలేదు. ఈ పోరాటంలో మనమే గెలుస్తున్నాం, శత్రువును అణిచివేస్తున్నాం" అని నెతన్యాహు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 48 గంటల్లో జరిగిన ఘటనలు ఇరాన్ ప్రపంచ భద్రతకు ఎంత ప్రమాదకరమో నిరూపిస్తున్నాయని హెచ్చరించారు. అరాడ్, డిమోనా నగరాల్లోని పౌర ప్రాంతాలే లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో దాడి చేసిందని, ఈ దాడుల్లో సుమారు 200 మంది గాయపడ్డారని తెలిపారు. అరాడ్‌లో రెండు భవనాల మధ్య క్షిపణి పడినా ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమని, కానీ పౌరులను చంపడమే ఇరాన్ ఉద్దేశమని ఆయన ఆరోపించారు. ఇటీవల ఇరాన్ ప్రయోగించిన ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్ (ఐసీబీఎమ్) హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా సైనిక స్థావరంపై పడిందని, అది 4,000 కిలోమీటర్లు ప్రయాణించిందని నెతన్యాహు పేర్కొన్నారు. "ఇరాన్ ఇప్పుడు యూరప్ లోతుల్లోకి కూడా చేరగల సామర్థ్యం కలిగి ఉంది. వారు అందరినీ తమ పరిధిలోకి తెచ్చుకున్నారు" అని ఆయన హెచ్చరించారు. అంతర్జాతీయ సముద్ర మార్గాలను, ఇంధన సరఫరా వ్యవస్థలను బెదిరిస్తూ ఇరాన్ ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తోందని నెతన్యాహు విమర్శించారు. ఇజ్రాయెల్, అమెరికాతో పాటు ప్రపంచ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తాము ఇరాన్ పౌరులను కాకుండా, ఆ దేశ పాలనాయంత్రాంగం, వారి స్థావరాలు, ఆర్థిక వనరులనే లక్ష్యంగా చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ఘటనలతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

## హైదరాబాదులో శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి

హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని బాల్కనీ శ్లాబు కూలిపోవడంతో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మూడో అంతస్తులోని తన ఫ్లాట్‌లో ఎలక్ట్రికల్ పనుల కోసం ఇంటి యజమాని దివాకర్ ప్రసాద్ ఇద్దరు ఎలక్ట్రీషియన్లను పిలిపించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన దేవిదాస్ (56), వివేక్ (32) పనులు చేస్తుండగా, యజమాని దివాకర్ బాల్కనీలో నిల్చుని ఉన్నారు. ఈ క్రమంలో బాల్కనీ శ్లాబు ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురూ కిందపడిపోయారు. ఈ దుర్ఘటనలో దేవిదాస్, వివేక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన దివాకర్ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కీలక రంగాల్లో సరఫరా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం, లాజిస్టిక్స్‌ను పటిష్టం చేయడం, పంపిణీ వ్యవస్థలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడుదొడుకుల ప్రభావం వినియోగదారులు, పరిశ్రమలపై పడకుండా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. తగినన్ని నిల్వలను కొనసాగించేందుకు, సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కీలకమైన హార్ముజ్ జలసంధి వంటి సముద్ర మార్గాలకు అంతరాయం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై ప్రధాని మోదీ ఒకరోజు ముందే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతి, స్థిరత్వం అవసరాన్ని నొక్కిచెప్పడంతో పాటు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను సురక్షితంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో భాగంగా, భారతదేశం ఇప్పటికే తన చమురు దిగుమతులను అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి పెంచుకుంది. ప్రస్తుతం మన చమురు దిగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ యేతర దేశాల నుంచే వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అమెరికా నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామని, వినియోగదారుల స్థాయిలో సరఫరాకు ఎలాంటి అంతరాయం లేదని వారు స్పష్టం చేశారు.

## 25 ఏళ్లుగా అధికారంలో.. ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు

ప్రధాని నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఓ చారిత్రక మైలురాయిని అందుకున్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధినేతగా పనిచేసిన వ్యక్తిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ప్రజా జీవితంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఆయన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. పవన్ కుమార్ చామ్లింగ్ సిక్కిం సీఎంగా 8,930 రోజులు పదవిలో కొనసాగగా, నరేంద్ర మోదీ ఆ రికార్డును దాటి 8,931 రోజులు పూర్తి చేసుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా ఆయన పనిచేసిన కాలాన్ని కలిపి ఈ ఘనత సాధించారు. ఈ అరుదైన మైలురాయి ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**సీఎంగా, పీఎంగా అత్యధిక కాలం**
నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 మే 21 వరకు, దాదాపు 13 ఏళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగి, గుజరాత్‌కు అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా నిలిచారు. అనంతరం 2014 మే 26న 14వ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా, వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నేతగా ఆయనకు పలు రికార్డులు ఉన్నాయి. పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తిచేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా ఆయన ఘనత సాధించారు.

**సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లు**
రాజకీయ రికార్డులతో పాటు, డిజిటల్ ప్రపంచంలోనూ మోదీ తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ ఏడాది ఆయన సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లను దాటారు. ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుని, ప్రపంచ నేతల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత ఫిబ్రవరిలో ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌స్టాలో 10.1 కోట్ల మంది, ఎక్స్ (ట్విట్టర్) లో 10.64 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

## అధికార పీఠంపై 8,931 రోజులు... ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

నిజంగా ఒక అద్భుతమైన విజయం. ఈ అసాధారణ ఘనత, మన దేశ ప్రగతి, శ్రేయస్సు పట్ల ఆయనకున్న అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి, అవిశ్రాంత నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. 2047 నాటికి 'వికసిత భారత్'ను నిర్మించాలన్న ఆయన దార్శనికత మనందరిలో స్ఫూర్తిని నింపుతూ, దేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తోంది. దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చే ఈ ప్రయాణంలో ఆయనకు మరింత శక్తి, మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# బేస్తవారిపేటలో దారుణ హత్య



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 22**

బెస్తవారిపేట లో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సత్తాబి పెద్ద కుమారుడు రాజా హుస్సేన్, చిన్న కుమారుడు ఖాజావలి, కుటుంబానికి చెందిన రాజా హుస్సేన్ కుమార్తెను పొదలకుంట పల్లె గ్రామానికి చెందిన వలి అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. రాజా హుస్సేన్ అల్లుడు వలి గత కొన్ని రోజులుగా తన భార్యను వేధిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై రాజా హుస్సేన్ పలుమార్లు అతనిని హెచ్చరించినప్పటికీ, వలి వారిపై కక్ష పెంచుకొని ఆదివారం మధ్యాహ్న సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా, వెనుక గది ద్వారం నుండి ఇంట్లోకి ప్రవేశించిన వలి కత్తితో దాడి చేసిహత్య చేశాడు. అనంతరం అక్కడి నుండి పారిపోతుండగా రాజా హుస్సేన్ కనిపించడంతో అతని పైనా కూడా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## ఘనంగా టిడిపి పార్లమెంట్

# కమిటీ ప్రమాణ స్వీకారం

### -కందుకూరు నుంచి భారీగా హాజరైన తెలుగు తమ్ముళ్లు





**కందుకూరు పెన్ పవర్ మార్చి 22**

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటరీ కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో అటహాసంగా జరిగింది. కందుకూరు నియోజకవర్గం నుంచి కమిటీకి ఎంపికైన పలువురు నేతలు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఉన్నం వీరాస్వామి (పోకూరు), అధికార ప్రతినిధిగా చదలవాడ కొండయ్య (కందుకూరు) కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ రూబీ (కందుకూరు), మద్దసాని మహేంద్ర (ఆత్మకూరు), కార్యదర్శిగా దార్ల యలమందమ్మ (ఉలవపాడు) చేత పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు బీద రవిచంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ, రాబోయే ఎన్నికల్లో మళ్ళీ నాగేశ్వరరావు గెలుపు కోసం, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు. కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై, నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఉలవపాడు మండల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నాయకులు వడ్డేళ్ళ రవిచంద్ర, రాయపాటి శ్రీను, షేక్ గౌస్ బాషా, గడ్డం మాలకొండయ్య, పసుపులేటి రమణయ్య, సయ్యద్ జాకీర్, పొడపాటి మాధవ, కందగడ్ల వరుణ్, చిరుతోటి గిరిబాబు, పర్సు నాగేశ్వరరావు, చెవూరి రమేష్, చదలవాడ ఇమ్మనియేలు, పోలుబోయిన శ్రీను, లక్కంరాజు నరేష్, చక్రవర్తుల విజయ్ కుమార్, అమ్మనబ్రోలు రమేష్, యనమల రామారావు, అమ్మనబ్రోలు మాధవ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 22**

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సూచనలతో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నారాయణస్వామికి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేసిన తదుపరి దేవస్థానం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం రాత్రి కి కోవిలంపాడు,మిట్టపాలెం లో స్వామివారిని ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌కు మంచి స్పందన



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 22**

బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి వి యన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా బిజెపి అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు సూచనలతో కనిగిరి పట్టణంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంను బిజెపి అర్బన్ వి. నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై, వందేమాతరం గీతంతో కొనసాగింది. ఈ సందర్భంగా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు పి. శివారెడ్డి మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవిత చరిత్ర, ఆయన సిద్ధాంతాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న అభివృద్ధిని ప్రస్తావించారు. ప్రశిక్షణ మహా అభియాన్ కో-కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, విజయాలు, పార్టీ చరిత్ర మరియు వికాసంపై సమగ్రంగా వివరించారు. బిజెపి సీనియర్ నాయకులు పి.వి. కృష్ణారెడ్డి అభివృద్ధి అంశాలపై మాట్లాడగా, సోషల్ మీడియా రాష్ట్ర కో-కన్వీనర్ అభిలాష్ డిజిటల్ ప్రచారం ప్రాధాన్యతను వివరించారు. అలాగే బిజెపి నాయకులు షేక్ భాష "మన్ కీ బాత్", "చేరువ", "జనతా వారధి", "మన ఊరు-మన జెండా" వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనిల్ సోషల్ మీడియా వినియోగంపై సూచనలు అందించగా, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పద్మావతి కార్య విస్తరణ బూత్ మేనేజ్మెంట్ పై మార్గదర్శనం చేశారు కార్యక్రమం ముగింపు సందర్భముగా జేడీ నారాయణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు అనంతరం నిర్వహించిన శిక్షణ శిబిరంలో నాయకులకు పలు అంశాలపై మార్గ నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల స్థాయి బిజెపి నాయకులు వివిధ మోర్చా ప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# బ్యాటరీ వాహనాల రాయితీని సద్వినియోగం చేసుకోండి: మంత్రి డోలా



**టంగుటూరు, పెన్ పవర్ మార్చి 22**

జిల్లాలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు బ్యాటరీ వాహనాల రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సూచించారు. టంగుటూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా లారీ యజమానులు, పొగాకు కంపెనీ యజమానులు, కలప వ్యాపారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రవాణా ధరలు ఒకే విధంగా ఉండేలా చూడాలని లారీ ఓనర్లకు సూచించారు. యువగలం పాదయాత్రలో నారా లోకేశ్ హామీ మేరకు గ్రీన్ టాక్స్ తగ్గించామని చెప్పారు. రాష్ట్రంలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. రహదారులపై రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతి జిల్లాకు ముఖ్యమంత్రి రూ.కోటి ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాటరీ వాహనాలపై ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గుడ్లూరులో "ఆపరేషన్ వజ్ర ప్రహార్"

### కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహణ -సరియైన పత్రాలులేని 20 వాహనాలు స్వాధీనం

### తనిఖీలో సీఐతో పాటు 3 ఎస్సైలు, 30 సిబ్బంది - "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో భారీ ర్యాలీ



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 22:**

ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వేకువజామునే కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు(ఐపీఎస్) ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలు, 30 మంది పోలీసు సిబ్బంది కలిసి గుడ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్టీ కాలనీ మరియు పరిసర ప్రాంతాల్లో 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన తనిఖీలలో భాగంగా గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలతో పాటు పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, కొందరికి చలానాలు విధించారు. ఫింగర్ ప్రింట్ పరికరాలతో అనుమానితులను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో స్థానిక హైస్కూల్ ప్రాంగణం నుండి బస్టాండ్ కూడలి వరకు భారీర్యాలీ నిర్వహించి, గంజాయి నిర్మూలనకు ప్రజలతో పాటు పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ గంజాయి మరియు మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వి.వెంకట్రావు, వేలేటివారిపాలెం ఎస్సై మరిడి నాయుడు, లింగసముద్రం ఎస్సై పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తురిమెళ్లలో విదేశీ పక్షుల సందడి



**కంభం, పెన్ పవర్ మార్చి 22**

మండలంలోని తురిమెళ్ల చెరువులో ఆదివారం విదేశీ పక్షులు సందడి చేశాయి. యూరప్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నివాసించే గార్గని డక్ (చిన్న బాతు)లు కనిపించాయి. ఇవి నీటిలో ఉండే గడ్డి, మొక్కలు, గింజలతో పాటు కీటకాలు, పురుగులను తింటాయని బర్డ్ వాచర్ బెల్లంకొండ భాను పేర్కొన్నారు. ఇవి యూరప్ నుంచి భారత్, దక్షిణాఫ్రికా ప్రాంతాలకు వలస వెళ్తుంటాయని ఆయన తెలిపారు.

# ఘనంగా పోలేరమ్మ తల్లి తిరుణాళ్ల మహోత్సవం



**జె.పంగులూరు, పెన్ పవర్ మార్చి 22**

మండలంలోని కోటపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి పదో వార్షిక తిరుణాళ్ల మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి జలాభిషేకం, పొంగళ్లు సమర్పించి, తమ కోర్కెలను తీర్చాలని వేడుకున్నారు. అనంతరం అర్చక స్వాములు కొండకావూరి శివయ్య శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ తిరుణాళ్ల సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మూడు వేల మందికి అన్న వితరణ చేసినట్లు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

# రూ.4 లక్షలతో వసతుల కల్పన.. పూర్వ విద్యార్థుల దాతృత్వం



**జె.పొంగులూరు,పెన్ పవర్ మార్చి 22**

తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేసేందుకు, మౌలిక వసతుల కల్పనకు తోడ్పాడు అందించి పూర్వ విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. ప్రకాశం జిల్లా జె.పొంగులూరు మండలంలోని వడ్డవల్లి చందలూరులో వడ్డవల్లి శేషయ్య అడ్డగడ్డ భద్రయ్య జడ్పీ ఉన్నత పాఠశాల 1991-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమవంతుగా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.4 లక్షలు సమీకరించి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల కోసం నల్లపురాయితో ఫ్లోరింగ్ చేయించినట్లు పూర్వ విద్యార్థులు కొల్లే కిరణ్ బాబు, నారిన శ్రీనివాసరావు, త్రినేని మస్తాన్ చౌదరి, తాటికొండ షర్మిల, బెల్లంకొండ ప్రగతి తెలిపారు. దీనిని శనివారం పాఠశాల పూర్వ ప్రధాన ఉపాధ్యాయుడు నార్ని తాతయ్య.. పూర్వ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడ్డగడ్డ సుబ్బయ్య, పెండ్యాల కృష్ణారావు, వడ్డవలి వీరనారాయణ, శేషారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరు గిరిజ, పీడీలు ప్రతిమ, మధుమూర్తి పాల్గొన్నారు.

# పుర కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**అద్దంకి, పెన్ పవర్ మార్చి 22**


ప్రకాశం జిల్లా అద్దంకి పురపాలకంలోని 61 మంది కార్మికులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కమిషనర్ డి.రవీంద్ర, మేనేజర్ బి.శ్రీదేవి కార్మిక నాయకుల ఆదాము, భీష్మ, కార్మికులు పాల్గొన్నారు. కార్మికులు బాధ్యతగా పనిచేసి పురపాలక సంఘం అభివృద్ధికి, ప్రజల మెప్పు పొందేందుకు కృషి చేయాలని సూచించారు.

# కైపు వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**దొనకొండ మార్చ్ 22 పెన్ పవర్.**



మండల కేంద్రంలో స్థానిక రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల చైర్మన్ దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కైపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం శ్రీ కందుల ఓబుల్ రెడ్డి హాస్పిటల్ సహకారంతో ఈనెల 27 తారీకు ఉదయం 8 గంటల నుండి ఒంటిగంట వరకు రైల్వే స్టేషన్ ఎదురు ఏబీఏం చర్చి ప్రాంగణంలో దొనకొండ జనరల్ మెడిసిన్ వైద్యనిపునులు ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు గుండె వ్యాధి నిపుణులు లివర్ మరియు జీర్ణకోశ వ్యాధి వైద్య నిపుణులు కంటి వైద్య నిపుణులు షుగర్ బీపీ పరీక్షలు ఉచితంగా చేయబడును. డాక్టర్ల చే వైద్య పరీక్షలు జరిగి ఉచితంగా మందులు పంపిణీ చేయబడును. కావున దొనకొండ మరియు కురిచేడు మండలం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించ గలరని తెలియజేశారు. కూటమీ ప్రభుత్వ నాయకులు దొనకొండ కురిచేడు మండల లని పట్టించుకోవడం దొనకొండ లో తాగునీరు లేక గడిచిన 45 రోజులుగా ప్రజలు ఎంతో అవస్థ పడుతున్నారని కూటమీ ప్రభుత్వ నాయకులు సాగునీళ్లు, తాగునీళ్లు పరిష్కారం చూపించి రెండు మండలాల ప్రజల ఆదుకోవాలని చెప్పి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నియోజకవర్గ కార్మికుల సంఘం అధ్యక్షుడు జయరాజ్ మండల పార్టీ అధ్యక్షులు రామిరెడ్డి శివారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పరిశీకులు ఇరిగినేని వెంకట నరసయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖ్య నాయకులు షేక్ గఫూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# గిద్దలూరు డివిజన్ ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి వర్ధంతి

## నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 22**

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూ.టీ.ఎఫ్)- గిద్దలూరు డివిజన్ కార్యాలయంలో యూటిఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకట స్వామి వర్ధంతి సమావేశానికి జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి. పిచ్చయ్య అధ్యక్ష వహించి మాట్లాడుతూ అమరజీవి అప్పారి వెంకటస్వామి తన జీవితాన్ని యూటీఎఫ్ సంఘానికి, ఉద్యోగుల సంక్షేమానికి త్యాగం చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిలర్ పి. రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలు వీరి ఉద్యమ ఫలితమేనని అన్నారు. మాజీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వీరి ఆశయ సాధన కోసం ఉపాధ్యాయులు ఉద్యమ పోరాటాలల్లో క్రియాశీలకంగా పాల్గొని ఉపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. సీనియర్ నాయకులు మహానంది రెడ్డి, ఈ.రమణారెడ్డి, జి.బాల వెంకటేశ్వర్లు, జయచంద్రారెడ్డి తదితరులు మాట్లాడుతూ 24 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో లక్షకుపైగా సభ్యత్వం చేసిన ఘనత వీరికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ జిల్లా ఆవుల రాజు, గిద్దలూరు, రాచర్ల కొమరోలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, జక్కారఘురామ్, పి. రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, సి.వి. కృష్ణారెడ్డి, కోశాధికారులు హరికుమార్,మురళీధర్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు ఈ. వెంకటేశ్వర్లు, శ్యాముల్,పి. రమణారెడ్డి,హాకీం మరియు సభ్యులు జజ పాల్గొని అప్పారి వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

# నారాయణస్వామి సన్నిధిలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి దంపతులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 22**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం సన్నిధిలో ఆదివారం మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి దంపతులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సూచనలతో అర్చకులు మంకాల శివప్రసాద్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి దంపతులు ఆలయ గోశాలను సందర్శించి గోపూజ కార్తయక్రమంలో భాగంగా గోమాత కు పూజలు చేసిన తదుపరి ఆలయంలో నారాయణస్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ వేద మంత్రాలతో గోత్రనామాలు చదివి కాశిరెడ్డి దంపతులకు ఆశీర్వచ నాలు అందజేశారు. దేవస్థానం తరఫున శాలువాతో సత్కరించి తీర్థ ప్రసా దాలు అందజేశారు ఈ కార్యక్రమంలో అట్లూరి రామకృష్ణంరాజు దంపతులు, నారాయణస్వామి దేవస్థాన మాజీ కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణ రావు, అమడసాని బాలకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 22**

మండల కేంద్రంలోని ఆదివారం భారత్ పెట్రోల్ బంకు దగ్గర ఉన్న దోర్నాల టౌన్ క్రీస్తు సంఘం మందిరం నందు దోర్నాల టౌన్ అండ్ రూరల్ క్రీస్తు సంఘముల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు దోర్నాల టౌన్ క్రీస్తు సంఘం సభ్యులు మార్కాపురం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చాట్ల గంగయ్య ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సువార్తికులు బేతం యోహాను మాట్లాడుతూ చాట్ల గంగయ్య తండ్రిగారైన కీర్తిశేషులు సువార్తికులు చాట్ల ఏలియా గత 35 సంవత్సరములు గా క్రీస్తు సంఘముల అభివృద్ధి కొరకు సువార్త పనిని జరిగించి వారు మరణించిన తర్వాత తన కుమారుడైన గంగయ్య గత 15 సంవత్సరములు గా దోర్నాల టౌన్ క్రీస్తు సంఘమునకు సువార్తికులు గా ఉంటూ దోర్నాల ప్రాంతంలో అలాగే అనేక ప్రాంతాలలో క్రీస్తు సంఘాల అభివృద్ధి కొరకు కృషి చేస్తుండగా ఆ యొక్క పనిని గుర్తించి జిల్లా అధ్యక్షుడు ఎన్నుకోవడం చాలా గొప్ప సంగతి అని చెప్తూ వారు ఇలాగే అనేక క్రీస్తు సంఘములకు, సువార్తికుల కు సత్య వాక్యం బోధించి వారికి ప్రోత్సకారముగా ఉండాలని అనేకమందిని ఆత్మీయంగా అభివృద్ధి పరుస్తూ మంచి కార్యక్రమములు జరిగించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ప్రకాష్ రావు, బుధాల సుబ్బయ్య, చాట్ల రాజు, చాట్ల విజయ్, పులుకూరి కోటేష్ , రామచంద్రపు బెనర్జీ బాబు, ఉప్పలపాటి తిమోతి సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రాబోయే భవిష్యత్తుకు తరాలకు నీరే ఆధారం.

## జాయ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జి. అబ్రహం




**దొనకొండ మార్చి 22 పెన్ పవర్**

మండల కేంద్రంలో స్థానిక రైల్వే స్టేషన్ నందు ఆదివారం సాయంత్రం ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన జాయ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ గుడిమెట్ల అబ్రహం మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యత, సరఫరా పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసుకోవటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభా లను అధిగమించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే దీని ముఖ్య లక్ష్యం అన్నారు. నీటి సంరక్షణ మంచి నీటి వనరులు రక్షణ వాతావరణ మార్పులు ప్రభావాన్ని అరికట్టే చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బస్టాండు నందు చర్చి కాంప్లెక్స్ నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయ్ ఫౌండేషన్ సెక్రటరీ ఆవుల వెంకట శివకృష్ణ, వై ప్రసాదు, నాగయ్య, కోటయ్య వై మోజెస్ జాయ్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు జూదరులు అరెస్టు



**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 22**

పొన్నలూరు గ్రామ శివారు డొంక ప్రాంతంలో పొగాకు పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్సై సత్యనారాయణ ఆదివారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుండి రూ 5280 నగదను స్వాధీనం పరచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం.. నేలకొరిగిన మొక్కజొన్న

**అర్థవీడు, పెన్ పవర్ మార్చి 22**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం నాగులవరంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ గాలి వానకు సుమారు 30 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. సుమారు 50 ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న నెలకూలింది. వారం రోజుల్లో కోతలు చేపట్టాల్సి ఉండగా.. ఇలా నష్టం జరిగిందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అర్జీలను బుట్టదాఖలు చేస్తే సహించేది లేదు - అధికారులకు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు స్పష్టమైన ఆదేశాలు.




**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 23...**
చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా స్థానిక పార్టీ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతపై ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారు. ప్రధానంగా వీధి దీపాలు వెలగకపోవడం, పారిశుధ్య లోపం, తాగునీటి ఇబ్బందులు, సిసి రోడ్ల నిర్మాణం వంటి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే రెవెన్యూ సమస్యలు, భూ ఆక్రమణలు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు అర్జీలు అందించారు.

వినతి పత్రాలను స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే కళా వెంకటరావు మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్యల పరిష్కారం కోసం మన దగ్గరకు వస్తారని, వారి అర్జీల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించగలిగే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు తెలుగుదేశం నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజు, చీపురుపల్లి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామ నాయుడు, ఆర్ ఇ సి ఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, గవిడినాగరాజు పాల్గొన్నారు.

# వ్యవస్థలో లోపాలను స్వచ్ఛంద సంస్థలే ప్రశ్నించాలి.భీశెట్టి బాబ్జి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 18 :** ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను రాజకీయాలు, పార్టీలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాలకుల దృష్టికి తీసుకువచ్చి ప్రజా చైతన్య సదస్సులు నిర్వహించాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. ఆదివారం కణపాక యూత్ హాస్టల్లో మాతృభూమి సేవాసంఘం మొదటి వార్షికోత్సవ సదస్సులో సంస్థ అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు అధ్యక్షతన జరిగిన జిల్లా స్వచ్ఛంద సంస్థల సదస్సులో ఆయన మాట్లాడుతూ అధికార ప్రతిపక్ష పార్టీలన్నీ తమ ఉనికికోసం పాట్లు పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితులు దేశంలో రాష్ట్రంలో ఉన్నాయని, ప్రజాసంఘాలుగా కీలకమైన భూమికను స్వచ్ఛంద సంస్థలు పోషించక పోతే ప్రజలు నష్టపోతారని భీశెట్టి ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో పరిశ్రమలు మూతపడ్డా, రైతు సంక్షోభంలో ఉన్నా, పరిపాలన గాడి తప్పినా, యువతకి ఉపాధి అవకాశాలు లేకపోయినా అడిగే దిక్కులేని పరిస్థితి నెలకొందని యువజన, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు వాస్తవాలు తెలియచేసే పని చెయ్యాలని కోరారు.

యువత బాధ్యతతో వ్యవహరించక పోతే అభివృద్ధి ఆగిపోతుందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు చూసి ప్రజలు గందరగోళం లో ఉంటున్నారని రిటైర్డ్ చీఫ్ బ్యాంకింగ్ ఆఫీసర్ కెనరా బ్యాంక్ పిడకల ప్రభాకరరావు అన్నారు. ప్రభుత్వాలు మంచి పథకాలు చేపట్టినప్పుడు ప్రోత్సహించ వలసిన అవసరం స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, ముఖ్య అతిథి భీశెట్టి బాబ్జీని సంస్థ ప్రతినిధులు సత్కరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా, అనకాపల్లి జిల్లా, విజయనగరం జిల్లాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,చెరువుల పరిరక్షణ సమితి నాయకులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, జాగరపు ఈశ్వర ప్రసాద్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్ముల తిరుపతి రావు,స్పార్క్ పద్మనాభం, సంతోష్, వెంకటేష్, తాడేపల్లి నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు

# ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఉపయోగాలు తెలియజేసిన ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు.

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 23.**
తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి వర్యులు, చీపురుపల్లి శాసనసభ్యులు గౌరవ శ్రీ కిమిడి కళావెంకట రావు ఈరోజు చీపురుపల్లి, అగ్రహారంలో ఇంటింటికి వెళ్లి ఈ నెల 23వ తేదీన అనకాపల్లిలో శంకుస్థాపన జరగనున్న "ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్" గురించి మరియు ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలను, యువతకు వచ్చే ఉద్యోగాలు గురించి ప్రజలకు వివరించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలియజేసారు.

అలాగే యువత భవిష్యత్తుకు పెద్దపీట వేస్తూ రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకువస్తున్నారు..

ఈ సందర్భంగా ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ సంయుక్త ప్రాజెక్ట్ అయిన దేశంలోనే అతిపెద్ద "ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్" కు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 23వ తేదీన అనకాపల్లి జిల్లాలో శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు.. ఈ స్టీల్ ప్లాంట్ వలన యువతకు, కార్మికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు రానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజు



,చీపురుపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రౌతు కామనాయుడు, రైతు సంఘం అధ్యక్షులు పైల బలరాం, చీపురుపల్లి మాజీ ఎంపీపీ రైతు కాంతమ్మ, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ దన్నానరామచంద్రుడు, గొల్లల ములగాం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గడే సన్యాసప్పలనాయుడు, హారతి సాహు, సబ్బి సోనియా ,చీపురుపల్లి జనసేన ఇన్చార్జ్ శ్రీవిసనగిరి నివాసరావు పాల్గొన్నారు .

# కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే అధితి విజయలక్ష్మి గజపతిరాజు



**విజయనగరం టౌన్, పెన్ పవర్, మార్చి 22**: నక్కపల్లి వద్ద ఈ నెల 23 న శంకుస్థాపన చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ పై విజయనగరం ఎమ్మెల్యే అధితి గజపతిరాజు ఇంటింటా ప్రచారం చేస్తూ,దానిపై కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా యువత భవిష్యత్తుకు పెద్దపీట వేస్తూ రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకువస్తున్నారు, ఈ సందర్భంగా ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ సంయుక్త ప్రాజెక్ట్ అయిన దేశంలోనే అతిపెద్ద "ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్" కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ వలన యువతకు, కార్మికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు రానున్నాయని అన్నారు. రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ తీసుకువచ్చిన స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీ ద్వారా టీసీఎస్ తో మొదలుకొని, గూగుల్, కాగ్నిజెంట్ వంటి అనేక కంపెనీలు వచ్చాయని అన్నారు.

రాష్ట్రం ఒకవైపు పెట్టుబడులు, అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో ముందుకు వెళు తుందని, జూన్ నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ప్రారంభం కానుందని, దానికి అనుగుణంగా మెయింటెనెన్స్ రిపేర్ ఓవరాల్ ఏర్పాటు అవుతుందని తెలిపారు. మరోవైపు దేశంలోనే మొదటి జిఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ కి మాన్సాస్ చైర్మన్, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు 136 ఎకరాలు స్థలాన్ని ఇవ్వడం జరిగిందని, ఏవియేషన్ రంగంలో మన తెలుగు వారు 25 శాతం పైగా ఉండాలనే శ్నారా చంద్రబాబు నాయుడు , పూసపాటి అశోక్ గజపతి రాజు కోరిక అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

# ఉద్యోగ జీవితానికి వీడ్కోలు

* పదవీ విరమణ ఉద్యోగులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సన్మానం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 22** :పోర్ట్ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన ఉద్యో గులకు, అలాగే షష్టిపూర్తి జరుపుకున్న వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శివాజీపాలెం రోడ్డులోని సవేరా ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమం సాదరంగా,ఉత్సాహభ రితంగా జరిగింది.ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రభుత్వ ఉద్యోగం బాధ్యతలతో పాటు ఒత్తిడితో కూడుకున్నదని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అనం తరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడ పాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహ కులు, యాదవ సంఘం పెద్దలు, సభ్యులు మరియు పలువురు అతిథులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి, సన్మానితులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# గ్రామీణ ఆరోగ్యానికి వెలుగునిచ్చే కంటి శిబిరాలు






**ములగాడ, పెన్ పవర్, మార్చి 22** :గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితు ల్లో, స్వచ్ఛంద సంస్థలు మరియు సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. విశాఖపట్నం పశ్చిమ నియోజ కవర్గం ములగాడ గ్రామం జాషువా సంఘం కంటి పరీక్ష శిబిరం దీనికి మంచి ఉదాహరణగా నిలుస్తోంది.

అలుఫ్లోరైడ్ లిమిటెడ్ సౌజన్యంతో, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబి రం ద్వారా సుమారు 535 మంది ప్రజలకు కంటి పరీక్షలు చేయడం మాత్రమే కాకుండా, అవసర మైన వారికి వెంటనే కంటి అద్దాలు అందించడం ప్రశంసనీయ విషయం. సాధారణంగా గ్రామాల్లో కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అవి పెద్ద సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. అ లాంటి పరిస్థితుల్లో ఇలాంటి శిబిరాలు ప్రజలకు సమయానికి చికిత్స అందించే వేదికగా మారు తున్నాయి.

ప్రత్యేకంగా ములగాడ, ఎదురువాణిపాలెం, గోందేశివానిపాలెం వంటి ప్రాంతాల ప్రజలు ఒకేచోట చేరి వైద్య సేవలు పొందడం ద్వారా, ఆరోగ్యంపై అవగాహన కూడా పెరుగుతోంది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నా యకులు పాల్గొనడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరు గుతుంది.అయితే, ఇలాంటి కార్యక్రమాలు ఒక రోజు పరిమితంగా ఉండకుండా, నిరంతర ప్రక్రి యగా మారితే గ్రామీణ ఆరోగ్య పరిస్థితుల్లో మరింత మెరుగుదల సాధ్యమవుతుంది. ప్రభు త్వం కూడా ఈ తరహా కార్యక్రమాలను ప్రోత్స హిస్తూ, ప్రైవేట్ సంస్థలతో కలసి పని చేస్తే, ప్రతి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య సేవలు చేరవేయ డం సులభమవుతుంది.

ములగాడలో నిర్వహించిన ఈ కంటి శిబిరం కేవలం వైద్య సేవల కార్యక్రమం మాత్రమే కాకుండా, గ్రామీణ ఆరోగ్యాభివృద్ధికి మార్గ దర్శకంగా నిలిచే ఒక మంచి ప్రయత్నంగా భావించాలి.

ఈ కార్యక్రమానికి అలుఫ్లోరైడ్ లిమిటెడ్ నుంచి డైరెక్టర్ (ఫైనాన్స్) కే. పురుషోత్తం నాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఏ. చంద్రశేఖర్ హాజరయ్యారు.

ములగాడ గ్రామం నుంచి ధర్మాల వేణుగోపాల రెడ్డి, పెద్దాడ వెంకటరావు,పట్నాల నారాయణరావు, గుమ్మిడి సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.




# నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి,22** : నేడు (సోమవారం ) ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ (భూ సమస్యల పై) జిల్లా పరిషత్ లో నిర్వహించ బడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమములో లేదా ఆన్లైన్ లో వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మెరైన్ డీజిల్ ధరల పెంపుపై ఆందోళన-మత్స్యకార రంగాన్ని ఆదుకోవాలని వాసుపల్లి జానకీరామ్ విజ్ఞప్తి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 22** :రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్‌లలో మెరైన్ డీజిల్ ధరలను అకస్మాత్తుగా పెంచడంపై ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఇండియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. లీట రుకు రూ 97.72గా ఉన్న డీజిల్ ధరను ఒక్క సారిగా రూ 121.42కు పెంచడం వల్ల వేలాది మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ, పెట్రోలియం శాఖ మరి యు ఏపీసీఓఎఫ్ మెరైన్ డీజిల్‌ను కమర్షియల్/ఇండస్ట్రియల్ కేటగిరీ కింద వర్గీకరించడం వల్లే ఈ ధరల భారం పెరిగిందన్నారు. మత్స్యకార రంగం సంప్రదాయకంగా వ్యవసాయ అనుబంధ రంగంగా గుర్తింపు పొందిందని, కాబట్టి దీనిని వెంటనే వ్యవసాయ రంగం కింద పునర్వర్గీకరిం చాలని డిమాండ్ చేశారు.డీజిల్ ధర లీటరుకు దాదాపు రూ 24 మేర పెరగడంతో మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవల యజమానులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ఖర్చుల కారణంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది జీవనోపా ధి సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరిం చారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే జోక్యం చేసు కుని డీజిల్ ధరలను పాత స్థాయికి రూ 97రూ 98 తగ్గించాలని, అలాగే డీజిల్ సబ్సిడీ కార్డు లపై లీటరుకు రూ 9 సబ్సిడీ అందించేలా చర్య లు తీసుకోవాలని అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేశారు.ఇదే అంశంపై మత్స్యకార శాఖ మంత్రి, సంబంధిత అధికారులు మరియు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేసినట్లు జానకీ రామ్ తెలిపారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## నీటిని కాపాడదాం.. భవితకు భరోసానిద్దాం!

- జల సంరక్షణ మనందరి బాధ్యత
- పోలవరం ఎస్ఈ డోల తిరుమలరావు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 22:**నీటిని పొదుపుగా వాడటం, వనరులను సద్వినియోగం చేసుకోవడం, కలుషితం కాకుండా కాపాడటమే ఈ ఏడాది ప్రపంచ జల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని పోలవరం ప్రాజెక్ట్ (నాణ్యతా ప్రమాణాల విభాగం) పర్యవేక్షణ ఇంజినీర్ డోల తిరుమలరావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని వంశధార ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆఫ్ ఇండియా పూర్వపు చైర్మన్ ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి సారథ్యంలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుమలరావు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా నీటి ప్రాముఖ్యతపై అవగాహన పెరుగుతోందని పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న నీటి వనరులను రక్షించుకోవడంతో పాటు, మహిళలపై నీటి సేకరణ భారాన్ని తగ్గించడం, అందరికీ సమానంగా నీరు అందేలా చూడటం మన ప్రాథమిక లక్ష్యాలు కావాలని పిలుపునిచ్చారు.

ఈ వేడుకల్లో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎన్. రాంబాబు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎం. శ్రీనివాస్, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.వి. రమణ పాల్గొని జల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు పాపారావు, సంతోష్ రాజ్, మన్మధరావు, డాక్టర్ వాణి, రామలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ రాత్, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సన్మాన గ్రహీత రొక్కం కిరణ్ కుమార్





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,మార్చి 22 :**వరసిద్ధి వినాయక పూజ కమటి సెక్టార్ 6 విశాఖ స్టీల్ ప్లాంట్ ఉక్కునగరం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉగాది పురస్కార అవార్డు గ్రహీత రొక్కం కిరణ్ కుమార్ కి సన్మానించారు . కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా సి ఐ దాలిబాబు పాల్గొన్నారు . దాలిబాబు మాట్లాడుతూ కిరణ్ కుమార్ 22 సంవత్సరాల నుండి సుమారు 32000 వేల పాములు పట్టారు అటు పాములనుశీడి జనాలను కాపాడుతూ జనాలు నుండి పాముల్ని కాపాడుతూ ఉన్నారు కిరణ్ కుమార్ మన విశాఖపట్నం లో పుట్టడం ఇలాంటి సేవలు అందించడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉగాది పురస్కారం అవార్డు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీద ఉగాది రోజున ఉగాది పురస్కారం అవార్డు అందుకోవడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది అని అన్నారు ఉగాది అవార్డు కాకుండా మరెన్నో అవార్డులు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను సి ఐ దాలిబాబు అన్నారు . వీర్రాజు, మణికుమార్, రామ్మోహన్, సూరిబాబు, వరసిద్ధి వినాయక పూజ కమిటీ మెంబర్స్ సెక్టార్ 6 పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా లో భారీ భద్రతా ఏర్పాట్లు

- చందనాడలో స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సీఎం హాజరు



**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 22 :** నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ విస్తృతమైన భద్రతా మరియు ట్రాఫిక్ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో భారీ జనసందోహం ఏర్పడే అవకాశముంది. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

సభకు వచ్చే బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు మరియు ఇతర వాహనాలు కాగితా జంక్షన్ మార్గం ద్వారా కేటాయించిన పార్కింగ్ స్థలాలకు చేరుకోవాలి. సాధారణ ప్రజలు మరియు పార్టీ కార్యకర్తలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించాలి.

కేవలం వీఐపి పాస్ కలిగిన వారికి మాత్రమే ఉపమాక జంక్షన్ మార్గం ద్వారా సభా ప్రాంగణానికి ప్రవేశం కల్పించబడుతుంది.

ఇతర వాహనాలకు ఈ మార్గంలో అనుమతి ఉండదు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, కార్యక్రమ సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ మరియు ట్రాఫిక్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

ముందుగానే ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. తొందరపడకుండా క్రమశిక్షణతో సభా ప్రాంగణానికి చేరుకోవాలి. పార్కింగ్ సూచనలను గౌరవించాలి. కార్యక్రమం విజయవంతం చేయాలి. భారీ స్థాయిలో జరుగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పోలీసులు పేర్కొన్నారు. భద్రతా కారణాల రీత్యా అమలు చేస్తున్న మార్గదర్శకాలను అందరూ పాటించాలని కోరారు.

# ముగిసిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు






- నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- అక్రమాలపై విచారణ జరపాలి కూన రవికుమార్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 22:**జిల్లా అభివృద్ధి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయి సంఘాల సమావేశాలు సుదీర్ఘంగా జరిగాయి. ప్రజా ప్రతినిధులు సూచించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

రెండో స్థాయి సంఘం పరిధిలోని డి ఆర్ డి ఏ, డ్వామా, ఖాదీ, చేనేత, సహకార, టూరిజం శాఖల ప్రగతిపై చైర్‌పర్సన్ సమీక్షించారు. ఏడో స్థాయి సంఘం పరిధిలోని వంశధార ప్రాజెక్ట్ పనులు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపడుతున్న రహదారుల అభివృద్ధిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్టీసీ, సర్వశిక్షా అభియాన్, వైద్య ఆరోగ్య శాఖల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష చేస్తూ, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో భారీగా అవకతవకలు, స్కామ్‌లు జరిగాయని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయుసీ చైర్మన్ కూన రవికుమార్ ఆరోపించారు. వీటిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని రవికుమార్ సూచించారు. అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులను సహించేది లేదు. ప్రతి పైసా అర్హులైన పేదలకు అందాలని ఆయన హెచ్చరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో భారీ భూ కుంభకోణం ఆరోపణలు

కూటమి సర్కార్‌పై వైయస్సార్సీపీ ధ్వజం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 22 :**విశాఖపట్నంలో ప్రభుత్వ భూముల అక్రమాలపై రాజకీయ దుమారం రేగుతోంది. నగరంలోని వై యస్సార్సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వ హించిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అండతో 'భూ రాబందుల' కరాళ నృత్యం కొనసాగుతోందని, ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకో ణమని ఆయన విమర్శించారు.

రూ.5 వేల కోట్ల భూమి ఆక్రమణ ఆరోపణ

విశాఖ నగర నడిబొడ్డున ఉన్న సుమారు రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గీతం యూనివర్సిటీ యాజమాన్యం ఆక్రమించుకుంద ని కేకే రాజు ఆరోపించారు. సుమారు 54.49 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూముల క్రమబద్ధీకర ణను అధికార యంత్రాంగం వేగంగా ఆమోదించ డం వెనుక భారీ అవకతవకలు ఉన్నాయని అన్నారు. కోర్టు కేసులు కొనసాగుతున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకో వడం దుర్మార్గమని విమర్శించారు.

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం

ప్రభుత్వ భూమిగా గుర్తించిన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు తొలగించి, ప్రొక్లెయినర్లతో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు కలెక్టర్‌కు ఫిర్యాదు లు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రెండు వారాలుగా పనులు జరు గుతున్నా అధికారులు స్పందించకపోవడం అ నుమానాలకు తావిస్తోందన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

జీవీఎంసీ కమిషనర్ సహా సంబంధిత అధికా రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నా రని కేకే రాజు విమర్శించారు. అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకో వాల్సిన వారు మౌనం పాటించడం వెనుక ఒత్తి డులు



లేదా అవినీతి కారణాలున్నాయా అనే అనుమానం వ్యక్తం చేశారు.

బోగస్ కంపెనీలకు భూముల కేటాయింపు?


విశాఖలో విలువైన భూములను బోగస్ కంపెనీ లకు కేటాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. తక్కువ పెట్టుబడితో ఉన్న సంస్థలకు ఎకరా 99 పైసలకే భూములు ఇవ్వడం వెనుక పెద్ద స్కామ్ ఉందన్నారు. ఉర్సా, సత్వా, లూలూ వంటి సం స్థల పేరుతో భూముల దందా జరుగుతోందని పేర్కొన్నారు.

భారీ పోరాటానికి సిద్ధం

గీతం యూనివర్సిటీ ఆక్రమణలను వెంటనే నిలి పివేసి, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహా రంలో సహకరించిన అధికారులపై విచారణ జరిపించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించారు. ఉత్తరాంధ్రను భూ దోపిడీ నుంచి కాపాడేందుకు మేధావులు, ప్రజా సంఘా లతో కలిసి వైయస్సార్సీపీ భారీ ఉద్యమానికి సిద్ధమవుతోందని తెలిపారు.

ఈ సమావేశంలో పార్టీ సమన్వయకర్తలు తిప్ప ల శ్రీనివాస్ దేవాన్ రెడ్డి, మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

## చినుకు పడగానే అంధకారంలోకి గొల్లపల్లి గ్రామం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చి 22:**మండలంలోని ఏ.దారకొండ పంచాయితీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో తొలకరి వర్షాలు పడగానే విద్యుత్ సమస్య తీవ్రరూపం దాల్చింది. రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు స్తంభాల వద్ద షార్ట్‌సర్క్యూట్‌కు గురై గ్రామం చీకటిలో మునిగిపోయింది. గ్రామానికి సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌కు చెందిన ఇనుప స్తంభాలపైనే విద్యుత్ వైర్లు లాగడం వల్ల స్తంభాల మధ్య షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి నిప్పులు చెలరేగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.ఈ కారణంగా రెండు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి కొత్త స్తంభాలు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, కొత్త స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చిలకల లక్ష్మయ్య, లోచరి మల్లేశ్వరరావు, వండలం నాగేశ్వరరావు, చంటిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ విజయంతో 32వ వార్డులో ఉత్సాహం

కార్యకర్తలకు సత్కారం మాజీ ఎ మ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 22 :**పార్టీ ఆదేశాల మేరకు దక్షిణ నియోజకవర్గంలో చేపట్టిన డిజిటలైజేషన్ కార్యక్రమం 32వ వార్డు లో విజయవంతంగా పూర్తయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 32వ వార్డు అధ్యక్షుడు పినింట్ల రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో స్థానిక నాయకులు, కార్యకర్తలను ఘనంగా సత్కరించి స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కు మార్ మాట్లాడుతూ, వార్డు స్థాయిలో వేగవం తంగా డిజిటలైజేషన్ పూర్తి చేయడం అభినంద నీయమని పేర్కొన్నారు. దక్షిణ నియోజకవర్గం లో ఇప్పటికే 95 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, త్వరలోనే అన్ని వార్డుల్లో 100 శాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

రానున్న జీవీఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచు కుని ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాల ని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల్లో ప్రభుత్వం పై వ్యతిరేకత పెరుగుతోందని, ఈ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహా న్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరం తరం పోరాటం కొనసాగించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయం సాధించ డం ఖాయమని, జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ము ఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం తప్పదని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి వైఎ స్సార్సీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ యూత్ సెక్రటరీ కనకల ఈశ్వరరావు, 32వ వార్డ్ ప్రెసిడెంట్ పినింట్ల రాజారెడ్డి, 30వ వార్డ్ ఇంచార్జి సూరపతి అప్ప న్న, సౌత్ మహిళా ప్రెసిడెంట్ వాసుపల్లి బంగా రమ్మ, వార్డ్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, కోన జ్యోతి, స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ భాను మూర్తి, మాదిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాడుగుల నారాయణమూర్తి, గణగాళ్ల రామరాజు, మాజీ కార్పొరేటర్ పత్తిపిల్లి రాము, 33వ వార్డ్ ప్రెసిడెం ట్ ముత్తబాటుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రైతులకు భారీగా నష్టం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఎఫెక్ట్ ఏపీ ఆక్వారంగం పై భారీగా పడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆయా దేశాలకు ప్రతి రోజూ రొయ్యలు చేపలు ఎగుమతి అవుతుంటాయి. అయితే ఈ వార్ దెబ్బకు పాలిమర్ కొరత ఏర్పడింది. దీంతో ధర్మకోల్, ప్యాకింగ్ ధరలు పెరిగాయి. అయితే ప్యాకర్స్, ఎక్స్ పోర్టర్స్ఈ భారాన్ని రైతులపై మోపుతున్నారు. రైతుల నుంచి కేజీకి రూ.10 తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి రోజుకు 500 లారీలు ఎగుమతి అవుతుంటాయని, కేజీకి రూ.10 తగ్గించి కొనుగోలు చేయడంతో ప్రతి రోజు రూ. 75 లక్షల మేర తమకు నష్టం వాటిల్లుతోందని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ పోర్టర్లు, సీడ్ కంపెనీలు సిండికేట్‌గా మారి తమకు నష్టం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తాము కొన్ని కంపెనీల ఉత్పత్తులపై నిషేధం విధిస్తామని ఆక్వా రైతులు హెచ్చరించారు.అయితే తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని,
కానీ ఎలాంటి న్యాయం జరగడంలేదని తెలిపారు. ప్రభుత్వం, రైతుల మధ్య గ్యాప్ ఉందని, అప్పడ మీటింగ్‌లోనూ తమ సమస్యలను చెప్పుకున్నామని తెలిపారు



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అగ్రరాజ్యం అడుగు పడని నేల.. ఇండియా అంటే ఇదే కదా..




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ భూభాగం నుంచి ఇరాన్ పై దాడి జరిగిందన్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం, విదేశాంగశాఖ క్లారిటీ ఇచ్చింది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధానికి భారత్ భూభాగం వాడటాన్ని అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇరాన్ పై యుద్ధ అవసరాలకు భారత భూభాగాలను అమెరికా అడిగినట్లు జరుగుతున్న ప్రచారంపై కేంద్రం స్పందించింది. ఆ కథనాలు నిరాధారమైనవని తోసిపుచ్చింది. ఈ సందర్భంగా శ్రీలంక జలాల్లో ఇరాన్ నౌకపై జరిగిన దాడికి భారత్ కు సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది.ఇరాన్ పై యుద్ధం మొదలైన తర్వాత శ్రీలంక జలాల్లో ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేసింది. ఈ దాడిని అమెరికా భారత్ భూభాగం నుంచే ఆపరేట్ చేసిందని అంతర్జాతీయ మీడియా రిపోర్టు చేసింది. దీనిపై భారత విదేశాంగ శాఖ 'ఎక్స్'లో స్పష్టత ఇచ్చింది. అమెరికాతో భారత్ మిలటరీ ఒప్పందాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారని వివరించింది. అమెరికాతో ఒప్పందం కేవలం మిలటరీ వసతులను ఉపయోగించుకోడానికి మాత్రమేనని వెల్లడించింది. 2016లో భారత్, అమెరికా మధ్య లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరండమ్ ఆఫ్ అగ్రిమెంట్ (లెమోవా) కుదిరింది. దీని ప్రకారం యుద్ధ విమానాలు చమురు నింపుకునేందుకు వీలు కల్పించడమైంది. అదేవిధంగా వాటి మరమ్మతులకు సహకరించడానికి వీలు కల్పించారు.అయితే ఇరాన్ పై యుద్ధం వేళ భారత్ భూభాగం వినియోగానికి సంబంధించి జరుగుతున్న ప్రచారం విస్తృత చర్చకు దారితీసింది. ఇది భారత అలీన విధానానికి వ్యతిరేకమంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్రం అప్రమత్తమైంది. భారత దేశ ప్రయోజనాలు కాపాడటానికి దశాబ్దాలుగా అనుసరిస్తున్న అలీన విధానాన్ని కాపాడుతున్నట్లు క్లారిటీ ఇచ్చింది. అలీన విధానం అంటే ప్రపంచంలో ఏ దేశానికి మద్దతుగా వ్యవహరించకుండా అందరితో మిత్రుత్వం కోరుకునే తటస్థ వైఖరిగా వ్యాఖ్యానిస్తున్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన కొత్తలో ప్రపంచం అమెరికా, సోవియట్ యూనియన్ అనే రెండు వర్గాలుగా విడిపోయింది. అప్పుడు మొదటి ప్రధాని నెహ్రూ ఏ వర్గంలోనూ చేరకుండా 'అలీన విధానాన్ని' ఎంచుకున్నారు.ఏ ఒక్క దేశంపై ఆధారపడకుండా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం ఈ విధానం ముఖ్య ఉద్దేశం. భారత భూభాగంపై విదేశీ సైనిక స్థావరాలకు అనుమతి ఇస్తే, అది మనం వేరే దేశానికి బానిసలుగా మారామనే సంకేతాన్ని ఇస్తుందని భారత్ భావించింది. దీంతో 1947 నుంచి ఇప్పటివరకు అలీన విధానాన్నే కొనసాగిస్తోంది. ఇక అమెరికా ప్రపంచ వ్యాప్తంగా తన సైనిక స్థావరాలను విస్తరిస్తున్నా, మన దేశంలో మాత్రం తన స్థావరాన్ని మాత్రం ఏర్పాటు చేయలేకపోయింది.
ప్రస్తుతం అమెరికాకు ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో 750 వరకు సైనిక స్థావరాలు ఉన్నాయి. అమెరికా మిత్రదేశాలు అన్నింటిలోనూ సైనిక శిబిరాలు నిర్వహిస్తుండగా, ఇప్పటివరకు మన దేశం మాత్రం అమెరికా సహా ఏ దేశానికి ఆ అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుత ఇరాన్ యుద్ధం నేపథ్యంలో భారత్ విధానం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా భారత గడ్డపై అడుగు పెట్టలేకపోవడాన్ని హైలెట్ చేస్తూ నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.

# జనసేన కోసం చావడానికైనా సిద్ధం.. దమ్ముంటే రండి చూసుకుందాం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. తాజాగా జనసేన పార్టీ నాయకురాలు సుభాషిణి వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, ప్రాణహాని తలపెట్టేందుకు కూడా వెనకాడటం లేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. గతంలో జనసేనాని పవన్ కల్యాణ్‌పై వైసీపీ నాయకురాలు రోజా చేసిన విమర్శలను తాను తిప్పికొట్టానని, అప్పటి నుంచే వైసీపీ శ్రేణులు తనను టార్గెట్ చేశాయని సుభాషిణి పేర్కొన్నారు. "పవన్ కల్యాణ్‌పై రోజా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నేను కౌంటర్ ఇచ్చాను. నాటి నుండి వైసీపీ నేతలు నన్ను వ్యక్తిగతంగా దూషిస్తూ, సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా నన్ను చంపడానికి కూడా ప్రయత్నిస్తున్నారు." అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ ముఖ్య నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలను ఉద్దేశించి సుభాషిణి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "భూమన కరుణాకర్ రెడ్డికి, అభినయ్ రెడ్డికి నేను సవాల్ చేస్తున్నాను. దమ్ముంటే రండి.. ఎక్కడో తేల్చుకుందాం. నన్ను భయపెట్టాలని చూస్తే అది మీ భ్రమే. జనసేన పార్టీ కోసం, పవన్ కల్యాణ్ కోసం చావడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని సవాల్ చేశారు.

# పెట్రోలు పోస్తుండగా చెలరేగిన మంటలు.. చిన్నారి పరిస్థితి విషమం

**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం గోనబావి లో విషాదకర ఘటన జరిగింది. ఓ దుకాణం( లో బైక్ కు పెట్రోలు పోస్తుండగా ఒక్కసారిగా మంటలు ) చెలరేగాయి. దీంతో వాహనంపై ఉన్న దంపతులతో పాటు వారి వెంట ఉన్న చిన్నారికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**దంపతులకూ గాయాలు**

మరోవైపు దంపతులకు సైతం శరీరమంతా గాయాలయ్యాయి. చిన్నారి ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు. బహిరంగంగా విక్రయించే పెట్రోల్ వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఘటనకు కారణమైన దుకాణం దారుడిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అమెరికా 'అభిమన్యుడు' ట్రంప్ - పద్మవ్యూహంలో అధ్యక్షుడు!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహాభారత కాలం నాటి ఒక అత్యంత సంక్లిష్టమైన సైనిక వ్యూహం పద్మవ్యూహం. ఒకసారి పద్మవ్యూహంలో ప్రవేశించిన తర్వాత, బయటకు వచ్చే మార్గం తెలియకపోతే ప్రాణ సంకటమే.
అమెరికా అధ్యక్షుడు అంటే కేవలం ఒక దేశాధినేత మాత్రమే కాదు, ప్రపంచ గమనాన్ని శాసించగల 'సుప్రీం పవర్'. ఒక చిన్న కనుసైగతో ఖండంతరాల అవతల ఉన్న శత్రువులను మట్టికరిపించగలననే ధీమా అమెరికా అధ్యక్షుడి సొంతం. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో విడత పాలనను ఇదే ఆత్మవిశ్వాసంతో ప్రారంభించారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు చాలా తాపత్రయపడ్డారు. కానీ ఇరాన్ యుద్ధంలో ట్రంప్ ఆశలు ఆవిరి అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. భయపెట్టి ఇరాన్ ను లొంగదీసుకునే ప్రయత్నం సఫలం కాకపోవడంతో ట్రంప్ దిక్కులు చూస్తున్నారని అంటున్నారు. యుద్ధాన్ని ఎలా ముగించాలో తేల్చుకోలేక ట్రంప్ ఉత్తుత్తి ఘాంఢ్రింపులకు దిగుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.
రెండోసారి అధ్యక్షుడు అయ్యాక ట్రంప్ చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. టారిఫ్ లతో బలమైన మార్కెట్లు ఉన్న భారత్, చైనా వంటి దేశాలను భయపెట్టాలని చూశారు. వెనుజెవెలా, క్యూబా, సోమాలియా వంటి చిన్న దేశాలను బల ప్రయోగంతో లొంగదీసుకున్నారు. ఇదే ఊపులో ఇరాన్ ను తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని వ్యూహం రచించారు ట్రంప్. కానీ ఇరాన్ ఎదురుతిరిగింది. ట్రంప్ తో తాడోపేడో తేల్చుకోడానికి సిద్ధమైంది. ఈ క్రమంలోనే అమెరికా, ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధంలో అధ్యక్షుడు ట్రంప్ పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా విలవిల్లాడిపోతున్నారని అంటున్నారు.మహాభారత కాలం నాటి ఒక అత్యంత సంక్లిష్టమైన సైనిక వ్యూహం పద్మవ్యూహం. ఒకసారి పద్మవ్యూహంలో ప్రవేశించిన తర్వాత, బయటకు వచ్చే మార్గం తెలియకపోతే ప్రాణ సంకటమే. ప్రస్తుత ఇరాన్ యుద్ధంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ పద్మవ్యూహంతోనే పోల్చుతున్నారు. యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న కొద్ది ట్రంప్ లో నైరాశ్యం, నిరాసక్తత కనిపిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైన తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అమెరికా–ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. ఇది పెద్ద విజయంగా కనిపించినా, ఆ తర్వాత ఇరాన్ నుంచి వస్తున్న ప్రతిఘటన ఊహించని ట్రంప్ ఇప్పుడు యుద్ధం ముగింపుపై స్పష్టత లేక అల్లాడిపోతున్నట్లు కనిపిస్తోంది.తొలుత ఇరాన్ యుద్ధం 4 వారాల్లో ముగుస్తుందని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. కానీ ఇప్పుడు యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేమని పెంటగాన్ చేతులెత్తిసిందని వ్యాఖ్యానిస్తున్నారు. ముగించడం తెలియకపోతే ప్రారంభించడానికి అర్థం లేదని వ్యాఖ్యనిస్తున్నారు. ఒకవైపు యుద్ధం ముగింపు దశకు వచ్చిందని తన 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్ చేస్తున్నారు. అదే సమయంలో కాల్పుల విరమణకు సిద్ధంగా లేనని చెబుతూ తన అయోమయ స్థితిని ఆవిష్కరిస్తున్నారని అంటున్నారు.మరోవైపు ఇరాన్ యుద్ధం విషయంలో అధ్యక్షుడు ట్రంప్ ఇంటా, బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నట్లు కథనాలు వస్తున్నాయి. యుద్ధం నుంచి బయటపడే మార్గం ఏంటని అమెరికా కాంగ్రెస్ అధ్యక్షుడు ట్రంప్‌ను నిలదీస్తోంది. సరైన అనుమతులు లేకుండా యుద్ధానికి వెళ్లారని ఆయనపై విమర్శలు చేస్తోంది. ఇక యుద్ధం కీలక దశలో ఉన్న సమయంలో స్పెయిన్ వంటి దేశాలు తమ వైమానిక స్థావరాలను ఉపయోగించుకోవడానికి నిరాకరిస్తున్నాయి. దీనికి ప్రతిచర్యగా ట్రంప్ ఆ దేశాలతో వాణిజ్య సంబంధాలు తెంచుకుంటామని హెచ్చరించడం వల్ల అమెరికా అంతర్జాతీయంగా ఒంటరి అవుతోన్న సంకేతాలు పంపుతున్నాయని అంటున్నారు.
ఇక సౌదీ అరేబియా, ఖతార్, ఈజిప్ట్ వంటి దేశాలు ఈ యుద్ధం తమ ప్రాంతాన్ని నాశనం చేస్తుందని భావిస్తున్నాయి. అధ్యక్షుడు ట్రంప్‌కు సహకరించడానికి వెనుకాడుతున్నాయి. ఇదేసమయంలో చమురు ధరల పెరుగుదల ట్రంప్ ను ఒత్తిడికి గురిచేస్తోంది. ఈ కారణంగా అమెరికాలోనే కాకుండా మిత్రదేశాలైన జపాన్, యూరప్‌లో కూడా ద్రవ్యోల్బణం పెరిగే పరిస్థితులు నెలకొన్నాయనే భయం వ్యక్తమవుతోంది. దీంతో యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అధ్యక్షుడు ట్రంప్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి చేస్తున్నాయని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ను దారికి తెచ్చుకునేలా ట్రంప్ ఓ మెట్టు దిగినట్లు కనిపిస్తున్నారని అంటున్నారు. ఇరాన్ చమురు విక్రయాలపై నిషేధం తొలగించడాన్ని ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు.

# ఆయన చచ్చాడు.. ట్రంప్ ఆనందపడ్డాడు.. ఇదేం పైత్యం సామీ





**హైదరాబాద్ పెన్ పవర్:** మానవత్వం మంటగలిసిందా? రాజకీయ శత్రుత్వం మనిషి ప్రాణం కంటే విలువైనదా? అంటే అవుననే అంటున్నాయి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా వ్యాఖ్యలు. అమెరికా గూఢచారి సంస్థ ఎఫ్‌బీఐ మాజీ చీఫ్, సుదీర్ఘ కాలం దేశానికి సేవలందించిన రాబర్ట్ ముల్లర్ ××× (81) కన్నుమూయగా ఆయన మృతిపై సంతాపం ప్రకటించాల్సింది పోయి, ట్రంప్ అత్యంత దారుణంగా స్పందించడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.
ట్రంప్ 70 ఏళ్ల పైన ఉంటాయి. ఈ వయసు చనిపోయే వయసే.. ఈయన అంటే పడని ఒక అమెరికా ఎఫ్.బీఐ మాజీ చీఫ్ చనిపోతే ట్రంప్ నోరుపారేసుకున్నాడు.. ఆయన చావును ఆనందం వ్యక్తం చేస్తూ పోస్ట్ చేశాడు. రేపు ట్రంప్ చచ్చినా ఎవరూ కనీసం బాధపడకుండా వ్యవహరించేశాడు.

**ఏం జరిగింది?**

గత కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న రాబర్ట్ ముల్లర్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. అయితే ముల్లర్ మరణవార్త తెలిసిన వెంటనే ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "రాబర్ట్ ముల్లర్ ××× చనిపోయారు. ఆయన మృతి చెందినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నుంచి ఆయన అమాయకులను ఇబ్బంది పెట్టలేరు" అంటూ పోస్ట్ చేశారు. ఒక వ్యక్తి మరణాన్ని సెలబ్రేట్ చేసుకోవడం.. పైగా దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వైరానికి మూలం ఎక్కడ?**

ట్రంప్‌కు, ముల్లర్‌కు మధ్య వైరం ఈనాటిది కాదు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించినప్పుడు ఆ గెలుపు వెనుక రష్యా హస్తం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఈ కీలక అంశంపై అమెరికా న్యాయశాఖ విచారణ చేపట్టినప్పుడు రాబర్ట్ ముల్లర్ ప్రత్యేక న్యాయ సలహాదారుగా వ్యవహరించారు. ముల్లర్ నేతృత్వంలోని విచారణ కమిటీ ట్రంప్ పాలకవర్గాన్ని ఒక కుదుపు కుదిపేసింది. అప్పటి నుండి ముల్లర్‌ను ట్రంప్ తన బద్ధశత్రువుగా చూస్తూ వచ్చారు. అనేక సందర్భాల్లో బహిరంగంగానే ఆయనపై విమర్శలు గుప్పించారు.

**ముల్లర్ ప్రస్థానం.. ఒక ధీశాలి ప్రయాణం**

రాబర్ట్ ముల్లర్ సామాన్య వ్యక్తి కాదు. మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, సుమారు 12 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. అమెరికా చరిత్రలో అత్యంత కీలకమైన సమయంలో ఆయన సేవలు అందించారు. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత ఎఫ్‌బీఐని ఆధునీకరించడంలో ఆయన పాత్ర కీలకం. నిజాయితీకి మారుపేరు.. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విచారణలు జరపడంలో ఆయనకు పేరుంది. దేశీయ నేరాలను అరికట్టడంలోనూ, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంలోనూ ఆయన వ్యూహాలు అమోఘం.

**మతం లేని రాజకీయం.. మనిషివేనా ట్రంపూ?**

ట్రంప్ వయసు ప్రస్తుతం 70 ఏళ్లు దాటింది. వయసు రీత్యా ఎప్పుడైనా ఏదైనా జరగవచ్చు. ఇటువంటి సమయంలో, ఒక వృద్ధుడి మరణంపై ఇంతటి కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఏంటని సామాన్య ప్రజలు సైతం ప్రశ్నిస్తున్నారు. "ఆయన చచ్చాడట.. ట్రంప్ ఆనందపడ్డాడు.. నువ్వు అసలు మనిషివేనా?" అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు.
రేపు ట్రంప్ విషయంలోనూ ఇలాగే ఎవరైనా స్పందిస్తే పరిస్థితి ఏంటి? ఒక వ్యక్తితో రాజకీయ విభేదాలు ఉండవచ్చు.. కానీ చనిపోయిన తర్వాత కూడా ఆ వ్యక్తిని దూషించడం నాగరిక సమాజం హర్షించదు. ముల్లర్ తన జీవితమంతా దేశ సేవకే అంకితం చేశారని.. అటువంటి వ్యక్తిపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారాన్ని సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరణం అనేది అందరికీ అనివార్యం. రాబర్ట్ ముల్లర్ మరణంతో అమెరికా ఒక గొప్ప అధికారిని కోల్పోయింది. కానీ ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికా రాజకీయాల్లో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతాయి. ప్రత్యర్థి మరణాన్ని చూసి ఆనందించే మనస్తత్వం నాయకత్వ లక్షణం అనిపించుకోదు.

# ఐపీఎల్ 'పీటర్ పాన్స్'.. కోహ్లీ- ధోని- రోహిత్ సుదీర్ఘ ప్రయాణం ఇదే



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) ఇప్పుడు 19వ సీజన్‌లోకి అడుగుపెట్టింది. దాదాపు రెండు దశాబ్దాల ప్రస్థానంలో ఎందరో ఆటగాళ్లు వచ్చి వెళ్లారు. కానీ, కొందరు మాత్రం మొదటి సీజన్ (2008) నుంచి నేటి వరకు ఈ లీగ్ లో తమదైన ముద్ర వేస్తూనే ఉన్నారు. వారిలో ముగ్గురు ఐపీఎల్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారగా, నాలుగో వ్యక్తి ఒక చారిత్రాత్మక రికార్డుతో హిస్టరీలో నిలిచిపోయాడు. ఈ నలుగురినే ఐపీఎల్ 'పీటర్ పాన్స్'గా పిలుస్తుంటారు.

**విరాట్ కోహ్లీ (ఆర్సీబీ)**

2008లో అండర్-19 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత జట్టు కెప్టెన్‌గా కోహ్లీతో ఆర్సీబీ ఒప్పందం చేసుకుంది. ఆరంభంలో 'చీకూ' గా పిలవబడే ఇతడు, కొన్ని సీజన్ల తర్వాత లీగ్ లోనే తిరుగులేని దిగ్గజ క్రికెటర్ గా ఎదిగాడు. కాగా ఐపీఎల్ చరిత్రలో 9,000 పరుగులు మైలురాయిని అందుకున్న తొలి ప్లేయర్ గా విరాట్ నిలవనున్నాడు. అలాగే ఒకే ఫ్రాంచైజీ (RCB) తరపున 267 కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన ఏకైక ఆటగాడిగా కొనసాగుతు న్నాడు. ఈ రికార్డును భవిష్యత్తులో ఎవరూ కూడా అధిగమించే అవకాశం లేదు.

**ఎంఎస్ ధోనీ (సీఎస్కే)**

44 ఏళ్ల వయసులో తన కెరీర్ చివరి సీజన్ ఆడుతున్నట్లు కనిపిస్తున్న మహేంద్ర సింగ్ ధోనీ, ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు (278) ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. చెన్నై సూపర్ కింగ్స్ రెండేళ్ల నిషేధానికి గురైనప్పుడు, ధోనీ రైజింగ్ పూణే సూపర్‌జెయింట్ తరపున 30 మ్యాచ్‌లు ఆడాడు. ఈ 2026 సీజన్‌తో కోహ్లీ తర్వాత ఒకే ఫ్రాంచైజీ (జుఖ) తరపున 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న రెండో ఆటగాడిగా ధోనీ రికార్డు నెలకొల్పనున్నాడు.

**రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్)**

విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోనీ కంటే ముందు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్రోఫీని ముద్దాడింది రోహిత్ శర్మ (2009లో డెక్కన్ ఛార్జర్స్ తరపున)..

ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు వెళ్లిన తర్వాత, సచిన్ టెండూల్కర్ వారసుడిగా ఆ జట్టుపై తనదైన మార్క్ వేశాడు ఈ ముంబై కి రాజా. ముంబై ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లను అందించిన కెప్టెన్ రోహిత్. ప్రస్తుతం ఒక సాధారణ ప్లేయర్ గానే జట్టులో కొనసాగుతున్నాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో ఏడో ఐపీఎల్ టైటిల్ గెలవాలనే పట్టుదలతో ఈ సీజన్‌లో బరిలోకి దిగబోతున్నాడు.

**మనీష్ పాండే (చారిత్రాత్మక రికార్డు)**

మనీష్ పాండేను కోహ్లీ, ధోనీలతో సమానమైన దిగ్గజంగా పేర్కొనలేకపోయినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో

అతడి పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది. ఈ ఐపీఎల్‌లో మొదటి సెంచరీ సాధించిన తొలి భారతీయ బ్యాటర్ మనీష్ పాండే (2009లో డెక్కన్ ఛార్జర్స్‌పై 114 పరుగులు) నిలిచాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR), సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) సహా ఏడు వేర్వేరు జట్ల తరపున ఆడాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

# ప్రాక్టీస్ మ్యాచ్‌లోనే 282 రన్స్.. మరోసారి దుమ్మురేపేందుకు సిద్ధమైన ఎస్ఆర్‌హెచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 రణరంగం స్టార్ట్ కావడానికి మరో వారం రోజులే సమయం ఉంది. మార్చి 28వ తేదీన గ్రాండ్ గా ప్రారంభం కానున్న ఈ క్యాష్ రిచ్ లీగ్ కోసం అన్ని జట్లు రెడీ అవుతున్నాయి. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ తమ సొంత గడ్డపై ప్రాక్టీస్ మ్యాచులతో చెలరేగిపోతుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు సిక్సర్ల వర్షం కురిపించారు. ఎస్ఆర్‌హెచ్- A, ఎస్ఆర్‌హెచ్- దీ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ లో బౌలర్లకు చుక్కలు చూపించారు. విధ్వంసకర బ్యాటింగ్ తో సన్ రైజర్స్ ఈసారి ట్రోఫీ గెలిచేలా కనిపిస్తుందని ఫ్యాన్స్ అంటున్నారు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ మైదానంలో జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్- ఏ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ఫస్ట్ బాల్ నుంచే బౌలర్లపై విరుచుకుపడటంతో.. జస్ట్ 42 బంతుల్లోనే 94 రన్స్ చేసి సెంచరీని జస్ట్ మిస్ చేసుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (49), సలీల్ అరోరా (47) రాణించడంతో ఆ జట్టు కేవలం 21 ఓవర్లలో 253 పరుగులు చేసింది. బౌలింగ్‌లో జయదేవ్ ఉనద్కత్ 5 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు స్ఆర్‌హెచ్- దీ బ్యాటర్లు రెచ్చిపోయారు. 20 ఓవర్లలో ఆ జట్టు 9 వికెట్ల నష్టానికి ఏకంగా 282 రన్స్ చేసింది. ఇషాన్ కిషన్ కేవలం 25 బంతుల్లోనే 72 రన్స్ తో తన ఫామ్‌ను కంటిన్యూ చేశాడు. సలీల్ అరోరా రెండు జట్ల తరపున బ్యాటింగ్ చేసి, ఈసారి 26 బంతుల్లో 56 పరుగులు బాదాడు. హర్ష దూబె చివర్లో 14 బంతుల్లో 37 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా.. బౌలింగ్‌లో హర్షల్ పటేల్ 3 వికెట్లు తీసుకున్నప్పటికీ భారీగా పరుగులు ఇచ్చాడు. ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పోటీ పడనుంది. ఈ సీజన్ లోని పలు మ్యాచులకు సన్‌రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఇషాన్ ఆధ్వర్యంలోనే ఈసారి ఎస్ఆర్‌హెచ్ బరిలోకి దిగబోతుంది. కాగా 2024లో ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ చేజార్చుకున్న సన్‌రైజర్స్, ఈసారి ప్రాక్టీస్ మ్యాచుల్లోనే 250ంకి పైగా స్కోర్లు చేస్తుండటం చూస్తుంటే ఐపీఎల్ లోని ఇతర జట్లకు గట్టి హెచ్చరికలు పంపినట్లు అవుతుంది. అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్ లాంటి పవర్‌ఫుల్ హిట్టర్లకి ఇషాన్ కిషన్ జత కలవడంతో జట్టుకు ప్లస్ అయింది. కానీ బౌలింగ్ లో మాత్రం ఎస్ఆర్‌హెచ్ జట్టు కాస్త బలహీనంగా కనిపిస్తుంది.

# ఢిల్లీకి తిరిగొచ్చిన పృథ్వీ షా... "మీ అబ్బాయి ఇంటికొచ్చాడు" అంటూ భావోద్వేగం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ ఓపెనర్ పృథ్వీ షా తన ఐపీఎల్ ప్రస్థానం మొదలైన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి తిరిగి వచ్చాడు. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 19వ సీజన్ కోసం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జట్టు శిక్షణా శిబిరంలో అతడు అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా తన పునరాగమనంపై తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఏడేళ్ల పాటు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వీ షాను, ఐపీఎల్ 2025 వేలానికి ముందు ఫ్రాంచైజీ విడుదల చేసింది. ఆ తర్వాత జరిగిన వేలంలో అతడిని కొనుగోలు చేసేందుకు ఏ జట్టూ ఆసక్తి చూపకపోవడంతో అన్‌సోల్డ్‌గా మిగిలాడు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్ 2026 వేలంలోనూ మొదట అతడికి నిరాశే ఎదురైంది. కానీ, చివరి రౌండ్‌లో (యాక్సిలరేటెడ్ ఫేజ్) అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్సే అతడిని రూ. 75 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసి తిరిగి జట్టులోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో సొంత గూటికి చేరిన పృథ్వీ షాపై ఢిల్లీ క్యాపిటల్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'మన అబ్బాయి ఇంటికి తిరిగొచ్చాడు' అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను పంచుకుంది. అందులో పృథ్వీ షా మాట్లాడుతూ.. "కోట్లా (అరుణ్ జైట్లీ స్టేడియం) లాంటి ప్రదేశాన్ని ఎవరూ మర్చిపోలేరు. అక్కడి శబ్దాన్ని, నిశ్శబ్దాన్ని మర్చిపోలేం. కొన్ని కథలు ముగిసిపోవు, తిరిగి వస్తాయి. ఢిల్లీ.. మీ అబ్బాయి ఇంటికి వచ్చేశాడు" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించాడు. 2018లో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన తర్వాత పృథ్వీ షాను ఢిల్లీ జట్టు రూ. 1.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీ తరఫున ఏడు సీజన్లలో 79 మ్యాచ్‌లు ఆడిన షా, 23.5 సగటుతో 1,892 పరుగులు చేశాడు. ఇందులో 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. గత సీజన్‌లో ఢిల్లీ జట్టు 14 మ్యాచ్‌లలో 7 విజయాలతో ఐదో స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్ అవకాశాన్ని త్రుటిలో కోల్పోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీ గెలవని ఆ జట్టు, ఈ సీజన్‌లోనైనా ఆ కలను నెరవేర్చుకోవాలని పట్టుదలగా ఉంది. బీసీసీఐ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 1న లక్నోలోని ఏకానా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ తన తొలి మ్యాచ్ ఆడనుంది.



సల్మీ ఫోటోషూట్ సిరీస్‌లో దిశా పటానీ స్టన్స్

# సందీప్ కిషన్.. ట్రాక్ మార్చినట్లు ఉన్నారే..

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ సందీప్ కిషన్ కెరీర్ లో కనపడుతున్న బిగ్ ఛేంజ్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, మధ్యలో కొంత స్లో అయినప్పటికీ ఇప్పుడు సరైన ప్లాన్ తో సెకండ్ ఇన్నింగ్స్ ను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా కంటెంట్ కు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంచుకుంటూ, తన ట్రాక్ ను పూర్తిగా మార్చినట్లుగా కనిపిస్తోంది.

ఇటీవల మంచి విజయం సాధించిన శంబాల చిత్ర దర్శకుడు ఉగంధర్ మునితో సందీప్ కిషన్ చేతులు కలపడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఆ కాంబినేషన్ లో సోషియో-ఫాంటసీ జానర్ లో ఓ భారీ చిత్రం రూపొందనుంది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించింది. ఆ చిత్రాన్ని నిర్మాతలు రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించనుండగా.. కంటెంట్ పరంగా స్ట్రాంగ్ కథతో రానుందని టాక్.


అదే సమయంలో సందీప్ కిషన్ లైనప్ లో ఉన్న మరో ఆసక్తికర ప్రాజెక్ట్ పవర్ పేట. ఆ చిత్రాన్ని కృష్ణ చైతన్య తెరకెక్కించనున్నారు. రౌడీ ఫెలో, చల్ మోహన్ రంగ, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి వంటి చిత్రాలతో తనదైన టాలెంట్ ను ప్రూవ్ చేసుకున్న కృష్ణ చైతన్య.. స్ట్రాంగ్ కంటెంట్ తో సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో పవర్ పేటపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది.

మరోవైపు, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న సిగ్మా ప్రాజెక్ట్ కూడా సందీప్ కిషన్ కెరీర్ లో ప్రత్యేకంగా నిలిచే అవకాశం ఉంది. ఆ చిత్రానికి దళపతి విజయ్ కొడుకు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టైలిష్ యాక్షన్ హీస్ట్ థ్రిల్లర్ గా రానున్న ఆ సినిమా 2026 వేసవిలో విడుదల కానుందని సమాచారం. సందీప్ ఇలాంటి జోనర్ లో నటించడం తొలిసారని తెలుస్తుండడంతో మంచి అంచనాలు నెలకొన్నాయి.

అలా వరుసగా భిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న సందీప్ కిషన్, కెరీర్ లో కొత్త ట్రాక్ ను ఎంచుకున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఒకే తరహా పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్న జోనర్లలో తన టాలెంట్ చూపించాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో స్నేహగీతం, ప్రస్థానం వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన సందీప్ కిషన్, కెరీర్ ప్రారంభంలోనే మంచి నటుడిగా గుర్తింపు పొందారు.

వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, తెనాలి రామకృష్ణ బీఏ బీఎల్ వంటి సినిమాలతో విజయాలు అందుకున్నప్పటికీ, మధ్యలో కొన్ని చిత్రాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. అయితే ఇప్పుడు కథల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సందీప్ కిషన్, మళ్లీ విజయాల బాట పట్టేలా కనిపిస్తున్నారు. మొత్తానికి కంటెంట్ కు ప్రాధాన్యం ఇస్తూ, కొత్త తరహా కథలను ఎంచుకుంటున్న సందీప్ కిషన్.. సెకండ్ ఇన్నింగ్స్ లో గట్టిగా సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో..





మెరూన్ లేస్ గౌనులో సాన్వే మేఘనా స్టన్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com